

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 13-05-2025 | సంపుటి - 24 | సంచిక - 11 | రూ : 4 | పేజీలు: 8


## భారత్-పాక్ అణుయుద్ధాన్ని

### మేమే ఆపాం: ట్రంప్

- మీతో బోలెడు వ్యాపారం చేస్తామని ఇద్దరికీ చెప్పాం
- కాల్పుల విరమణ శాశ్వతమని భావిస్తున్నా: ట్రంప్
- అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యల్ని తిప్పికొట్టిన భారత్

**మే 12,** న్యూయార్క్/వాషింగ్టన్: భారత పాకిస్థాన్‌ల మధ్య అణు యుద్ధాన్ని తన యంత్రాంగం నిలువరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం చాటుకున్నారు. ముందుగా యుద్ధాన్ని ఆపితే అమెరికా బోలెడు వాణిజ్యం చేస్తుందని ఇరు దేశాలకూ చెప్పినట్టు ట్రంప్ తెలిపారు. ''భారత్‌పాకిస్థాన్‌ల మధ్య తక్షణ కాల్పుల విరమణకు నా యంత్రాంగం మధ్యవర్తిత్వం వహించింది. ఇరుదేశాల మధ్య

తరువాయి 2లో





## పాకిస్తాన్ అణు స్థావరాలను భారత క్షిపణులు తాకాయా?

- కాళ్ల బేరం అందుకేనా!

మే 12, భారత్: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఎదురుదాడి చేస్తే దీటుగా బదులిస్తామన్న పాకిస్థాన్ ఒక్కసారిగా కాల్పుల విరమణ అనే కాళ్లబేరానికి ఎందుకు వచ్చింది? అప్పటిదాకా భారత్ పాక్ ఘర్షణను పెద్దగా పట్టించుకోని అమెరికా ఉన్నపళంగా ఎందుకు రంగంలోకి దిగింది? పాకిస్థాన్ అణు స్థావరాలను భారత క్షిపణులు తాకడమే ఇందుకు కారణమా అంటే.. అవుననే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. పాక్ అణుబూచికి ఎట్టిపరిస్థితుల్లోనూ భయపడే

తరువాయి 2లో

## బుద్ధవనంలో...

# ముద్దుగుమ్మలు...



- మిస్ వరల్డ్ 2025 పోటీల్లో భాగంగా రాష్ట్రంలో తొలి పర్యటన
- నాగార్జున సాగర్ చెంత ఫొటోషూట్.. బౌద్ధ భిక్షువులతో కలిసి ధ్యానం
- 'హలో వరల్డ్.. తెలంగాణ జరూర్ ఆనా' అంటూ నినాదం
- నేడు చార్మినార్ నుంచి లాడ్‌బజార్ వరకు హెరిటేజ్ వాక్

**మే 12, , నాగార్జునసాగర్ :** ఆసియాలోనే అతిపెద్ద మహాస్తూపం.. ఘనమైన చారిత్రక నేపథ్యం ఉన్న బుద్ధవనాన్ని సందర్శించి సుందరీమణులు ఆధ్యాత్మిక అనుభూతి పొందారు. సాయం సంధ్యవేళ, విద్యుద్దీపాలతో అలంకరించిన

తరువాయి 2లో

## రాష్ట్రంలోని స్థానికేతర కోటా

# ఇక పూర్తిగా మనవాళ్లకే...



- తెలంగాణ అభ్యర్థులు పోటీ పడటానికి అవకాశం లేదు
- వృత్తి విద్య, ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సులకు వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**మే 12, అమరావతి:** వృత్తి విద్య, డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఇప్పటి వరకు అమలవుతున్న 15% స్థానికేతర (నాన్ లోకల్), జనరల్ కోటా సీట్లను ఇక నుంచి పూర్తిగా ఏపీ వారికే

తరువాయి 2లో

## సిందూర్ విజయవంతమైంది



- పాక్‌లో నష్టానికి బాధ్యత అక్కడి సైన్యానిదే
- దాడుల వీడియోలను ప్రదర్శించిన రక్షణశాఖ

**మే 12, ఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని, పాక్ భూభాగంలో నష్టానికి బాధ్యత ఆ దేశ సైన్యానిదేనని రక్షణశాఖ వర్గాలు స్పష్టంచేశాయి. ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం విలేకరుల సమావేశంలో ఉన్నతాధికారులు మాట్లాడుతూ మరిన్ని వివరాలు వెల్లడించారు. పాకిస్థాన్ దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రు దుర్భేద్యంగా నిలిచాయని, దాయాది ఆటలు సాగనివ్వలేదని చెప్పారు. మన సైనిక స్థావరాలు,

తరువాయి 2లో

## అశక్త సైన్యాధ్యక్షుడి అస్తిత్వ ఆరాటం!

- కశ్మీర్‌లో కల్లోలానికి పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ కుయుక్తులు

**మే 12,** భారత్‌పాకిస్థాన్ తాజా ఉద్రిక్తతలకు పైకి కనిపిస్తున్న కారణాలు ఎలా ఉన్నా... మూలకారకుడు ఆ దేశ సైన్యాధ్యక్షుడు ఆసిం మునీర్! అనూహ్యంగా కాలం కలసి వచ్చి... ఆ పీఠం ఎక్కిన మునీర్... తన అశక్తతను కప్పిపుచ్చుకోవటానికి అస్తిత్వపోరాటం చేస్తున్నారు!

తరువాయి 2లో







# పాక్ కాళ్లబేరానికొచ్చింది

- ఆ దేశం గుండెపైనే కొట్టాం
- ఉగ్ర సౌధాలనే కాదు.. వారి నైతిక స్థైర్యాన్నీ కూల్చేశాం
- భారత్ దాడులను తట్టుకోలేకే దిగొచ్చారు
- ఇప్పుడిస్తున్నది విరామమే
- వారి వైఖరి చూశాక తదుపరి కార్యాచరణ
- ఉగ్రవాదం, ఆక్రమిత కశ్మీర్‌పై మాత్రమే చర్చలు
- సిందూరం తుడిచిన పరిణామమేంటో ముష్కరులకు తెలిసి వచ్చింది
- నవయుగ యుద్ధంలో పాక్‌ను మట్టి కరిపించాం
- స్వదేశీ ఆయుధ శక్తి చాటిచెప్పాం
- జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ

2లో

## త్వరలో భారత్ ఫ్యూచర్ సిటీని ఆవిష్కరిస్తాం

- ఐటీ సంస్థల కొత్త క్యాంపస్‌లన్నీ హైదరాబాద్‌లోనే
- రాష్ట్రానికి 16 నెలల్లో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు
- సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో



# పాక్ కాళ్లబేరానికొచ్చింది...

దిల్లీ, భారత్ ప్రళయభీకర దాడులను తట్టుకోలేకే పాకిస్థాన్ చివరకు కాల్పుల విరమణ పేరుతో కాళ్లబేరానికి వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. నవ యుగ యుద్ధంలో పాకిస్థాన్‌ను భారత్ మట్టి కరిపించిందని, వారు సరిహద్దుల్లో యుద్ధానికి దిగితే మనం వాళ్ల గుండెపైనే కొట్టగలిగామన్నారు. ఆ దేశ ప్రవర్తనను పరిశీలిస్తామని, మున్ముందు ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకోబోమని హెచ్చరించారు. ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన సోమవారం రాత్రి 8 గంటలకు జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ మొదలయ్యాక జాతినుద్దేశించి ఆయన మాట్లాడటం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా భారత్ వైఖరిని స్పష్టంగా చాటిచెప్పారు. దాయాది దేశం మన పాఠశాలలు, సాధారణ ప్రజల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటే.. వారి ముఖ్యమైన మౌలికవసతులు, ఉగ్రవాద స్థావరాలను విధ్వంసం చేసి మన సత్తాను చాటగలిగామని ప్రకటించారు. 21వ శతాబ్దపు సరికొత్త యుద్ధంలో భారత్ తన స్వదేశీ ఆయుధ శక్తిని ప్రపంచానికి చూపిందన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు వికృత క్రూరత్వాన్ని ప్రదర్శించి.. కుటుంబసభ్యుల ముందే అమాయక ప్రజలను చంపినందుకు ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర సౌధాలను కుప్పకూల్చి 100 మందికిపైగా పేరుమోసిన ఉగ్రవాదులను అంతమొందించినట్లు ప్రకటించారు. ఆ దేశంతో చర్చలంటూ జరిగితే ఉగ్రవాద నిర్మూలన, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై మాత్రమేనని స్పష్టం చేశారు. భారతదేశాన్ని, ప్రజలను రక్షించుకోవడానికి ఎంతపెద్ద నిర్ణయానికైనా వెనుకాడబోమని పాక్‌కు తేల్చిచెప్పారు.

### * సైనిక శౌర్య పరాక్రమాలకు సెల్యూట్

''అన్నింటికంటే ముందు మన సేనలు, నిఘా విభాగాలు, శాస్త్రవేత్తలకు ప్రతి భారతీయుడి తరఫున సెల్యూట్ చేస్తున్నా. ఆపరేషన్ సిందూర్ లక్ష్యం సాధించడానికి మన వీర సైనికులు విశేష శౌర్య పరాక్రమాలు ప్రదర్శించారు. నేను వారి వీరత్వం, సాహసం, పరాక్రమాన్ని ఈ దేశంలోని తల్లులు, సోదరీమణులు, ఆడబిడ్డలకు అంకితం చేస్తున్నా. పహల్గాంలో ఉగ్రవాదుల ప్రవర్తన ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. సెలవుల్లో ఆనందంగా గడుపుతున్నవారిని మతం అడిగి మరీ పిల్లల ముందు పాశవికంగా చంపడం ఉగ్రవాద వికృత రూపానికి, క్రూరత్వానికి పరాకాష్ఠ. దేశ సామరస్యాన్ని దెబ్బతీయడానికి వారు ప్రయత్నించారు. ఇది నాకు వ్యక్తిగతంగా అత్యంత దుఃఖం కలిగించింది. ఈ దాడి తర్వాత దేశం మొత్తం ఒక్కటైంది. ఉగ్రవాదంపట్ల కఠినంగా వ్యవహరించాలని నినదించింది. ఉగ్రవాదాన్ని మట్టిలో కలిపేందుకు ఆ తర్వాతే మేం భారత సేనలకు సంపూర్ణ స్వేచ్ఛనిచ్చాం. మన సోదరీమణులు, బిడ్డల నుదుటి సిందూరం తుడిచేయడానికి ప్రయత్నించిన ప్రతి ఉగ్రవాది, ఉగ్రవాద సంస్థలకు దాని పర్యవసానం ఏమిటో తెలిసి వచ్చింది.

### * కోట్ల మంది మనోభావనల ప్రతిబింబం

ఆపరేషన్ సిందూర్ కేవలం పేరు కాదు. కోట్ల మంది ప్రజల మనోభావనల ప్రతిబింబం. న్యాయం కోసం అఖండ ప్రతిజ్ఞ. భారతీయ సేన పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు, శిక్షణ కేంద్రాలపై అత్యంత కచ్చితత్వంతో దాడిచేసింది. భారత్ ఇంతపెద్ద నిర్ణయం తీసుకుంటుందని ఉగ్రవాదులు కలలో కూడా ఊహించలేదు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారతీయ క్షిపణులు, డ్రోన్లు విరుచుకుపడ్డాయి. ఉగ్రవాద సౌధాలతోపాటు వారి నైతిక స్థైర్యాన్ని కూల్చేశాయి. బహావల్‌పుర్, మురీద్కే లు ప్రపంచ ఉగ్రవాద విశ్వవిద్యాలయాలుగా మారాయి. ప్రపంచంలో ఎక్కడ ఏ పెద్ద ఉగ్రవాద దాడి జరిగినా అందులో వీటిపాత్ర ఉంటోంది. 9/11 సహా దేశంలో దశాబ్దాల తరబడి జరుగుతూ వచ్చిన పెద్దపెద్ద ఉగ్రవాద దాడులన్నీ వీటితో ముడిపడి ఉన్నాయి. ఉగ్రవాదులు మన సోదరీమణుల సిందూరం తుడిచేస్తూ వచ్చారు. అందుకే ఆ ఉగ్రవాద ప్రధాన కార్యాలయాన్ని సైన్యం ధ్వంసం చేసింది. గత మూడు దశాబ్దాలుగా ఈ ఉగ్రవాదులు పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతూ భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతూ వచ్చారు. ఒక్క దెబ్బతో వీరిని సైన్యం తుడిచిపెట్టింది.

### * బిత్తరబోయిన పాక్

భారత్ కార్యాచరణను చూసి పాకిస్థాన్ పూర్తి నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయింది. ఒక రకంగా బిత్తరపోయింది. ఈ తత్తరపాటులో మరో దుస్సాహసానికి పాల్పడింది. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు మద్దతు పలకడానికి బదులుగా భారత్‌పైనే దాడిచేయడం మొదలుపెట్టింది. మన పాఠశాలలు, కళాశాలలు, గురుద్వారాలు, ఆలయాలు, సామాన్య ప్రజల ఇళ్లను, మన సైనిక స్థావరాలనూ లక్ష్యంగా చేసుకుంది. కానీ పూర్తిగా నిర్వీర్యం అయిపోయింది. పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులు ఎలా గడ్డిపోచల్లా గాల్లో కలిసిపోయాయో ప్రపంచం చూసింది. పాకిస్థాన్ చాలా గర్వంగా భావించే వైమానిక స్థావరాలను మన సైన్యం పూర్తిగా దెబ్బతీసింది. ఆ నష్టాన్ని ఊహించడం కష్టం. అందుకే బయటపడే మార్గం కోసం పాకిస్థాన్ వెదికింది. ప్రపంచం మొత్తం తిరిగి అందర్నీ ప్రాధేయపడింది. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం పాకిస్థాన్ సైన్యం మన డీజీఎంవోని సంప్రదించింది. ఆలోపే మనం పాకిస్థాన్‌లోని మొత్తం మౌలిక వసతులను పూర్తిగా ధ్వంసం చేశాం. ఉగ్రవాద స్థావరాలను శిథిలాలుగా మార్చేశాం. అందుకే తమవైపు నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు, సైనిక దుస్సాహసాలు ఉండవని పాకిస్థాన్ చెప్పింది. భారత్ కూడా వాటిని పరిగణనలోకి తీసుకుని ఆలోచించింది. యుద్ధ మైదానంలో మనం ప్రతిసారీ పాకిస్థాన్‌ను మట్టి కరిపించాం. ఆపరేషన్ సిందూర్ రూపంలో ఎడారులు, పర్వతాల్లోనూ మన సామర్థ్యాలను ప్రదర్శించాం. ఈ ఆపరేషన్ ద్వారా 'భారత్‌లో తయారీ' ఆయుధాల ప్రామాణికత నిరూపితమైంది.

# త్వరలో భారత్ ఫ్యూచర్ సిటీని ఆవిష్కరిస్తాం



హైదరాబాద్, రాయదుర్గం : ''ఐటీ హబ్‌గా ఉన్న తెలంగాణను ప్రపంచ ఐటీ సంస్థల చిరునామాగా మార్చాం. దాంతో మైక్రోసాఫ్ట్, విప్రో, అమెజాన్ వంటి మేటి ఐటీ సంస్థల కొత్త క్యాంపస్‌లు, జీసీసీలు హైదరాబాద్‌కు తరలివస్తున్నాయి. కృత్రిమమేధ నగరం, స్కిల్స్ యూనివర్సిటీలతో కూడిన భారత్ ఫ్యూచర్ సిటీని త్వరలో ఆవిష్కరించనున్నాం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన 16 నెలల్లో రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయి'' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ కొత్త కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ''యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తూ... ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో లక్షకుపైగా ఉద్యోగాలు ఇప్పించాం. తాజాగా రాజీవ్ యువ వికాసం పేరుతో నిరుద్యోగ యువత ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, సొంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇప్పిస్తున్నాం. రాష్ట్రంలోని 66 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు వివిధ పథకాలను అమలు చేస్తున్నాం.

### అన్ని రంగాల్లో ప్రథమ స్థానం మనదే

ప్రభుత్వ నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలతో అన్ని రంగాల్లో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో కొనసాగుతోంది. ఉపాధి, ఉద్యోగ కల్పన, పోలీసింగ్, ద్రవ్యోల్బణం అదుపులో నంబర్‌వన్‌గా నిలిచాం. దావోస్‌కు వెళ్లినప్పుడు మన రాష్ట్ర ప్రతిభను చూసి వివిధ సంస్థలు రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. త్వరలో డ్రైపోర్టును ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని బందరు పోర్టుతో అనుసంధానించనున్నాం. ఐటీరంగంతోపాటు లైఫ్ సైన్సెస్‌లోనూ వేగంగా ముందుకు వెళ్తున్నాం'' అని వివరించారు.

### గ్లోబల్ వాల్యూ సెంటర్‌గా హైదరాబాద్

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... ''తెలంగాణలో నైపుణ్యాల విశ్వవిద్యాలయంతోపాటు డిజిటల్, కృత్రిమమేధ యూనివర్సిటీలను ప్రారంభించనున్నాం. భావి నగరంలో మరో రెండు నెలల్లోనే కృత్రిమమేధ వర్సిటీ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఐటీ సంస్థలు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తెరవెనుక చాలా శ్రమిస్తోంది. భవిష్యత్తులో హైదరాబాద్‌ను 'గ్లోబల్ వాల్యూ సెంటర్'గా రూపొందిస్తాం'' అని తెలిపారు. సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థను మున్ముందు మరింత విస్తరిస్తామని ఆ సంస్థ సీఈవో సమీర్‌ధీర్ వెల్లడించారు. తమ కంపెనీలో ప్రస్తుతం 2,700 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లున్నారని వచ్చే ఐదేళ్లలో 5,000 మందికి ఉద్యోగాలివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, క్వాంటమ్ సిస్టమ్స్ సీఈవో శ్రీని వీరవెల్లి, మాదాపూర్ డీసీపీ వినీత్, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిందూర్ విజయవంతమైంది

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థలు పూర్తిగా పని చేస్తున్నాయని, అవసరమైతే భవిష్యత్తులో ఏవైనా మిషన్లను చేపట్టడానికి అవి సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. పాక్‌లోని నూర్‌ఖాన్, రహీమ్‌యార్ ఖాన్ వైమానిక స్థావరాలపై దాడి దృశ్యాల వీడియోలను రక్షణశాఖ అధికారులు ప్రదర్శించారు. పాకిస్థాన్‌కు చెందిన మిరాజ్ ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్లు పేర్కొన్నారు. దాని శకలాలు వీడియోలో కనిపించాయి. అణ్వాయుధాల నిల్వలు ఉన్నట్లు చెబుతున్న పాక్‌లోని కిరానాహిల్స్‌పై భారత వాయుసేన ఎలాంటి దాడులు చేయలేదని స్పష్టంచేశారు.

## భారత్‌పాక్ అణుయుద్ధాన్ని మేమే ఆపాం

(మొదటిపేజీ తరువాయి)

ఈ కాల్పుల విరమణ శాశ్వతమని భావిస్తున్నా. అణ్వస్త్రాలు కలిగివున్న ఈ దేశాల మధ్య ప్రమాదకరమైన ఘర్షణను అంతం చేశాం. అణు యుద్ధం చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్న రెండు దేశాలను విరమింపజేశాం'' అని ట్రంప్ అన్నారు. భారత్, పాకిస్థాన్‌లకు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)లు తమంత తాముగా అవగాహనకు వచ్చారని, ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం లేదని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్న నేపథ్యంలో ఆయన మరోసారి ఇలాంటి ప్రకటన చేయడం గమనార్హం.

### నాలా ఎవరూ వాణిజ్యాన్ని వాడుకోలేదు

''ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల నివారణకు బహుశా ఎవరూ నా మాదిరిగా వాణిజ్యాన్ని వాడుకోలేదు. నా హెచ్చరికల ఫలితంగా అకస్మాత్తుగా వాళ్లు ఘర్షణ ఆపేస్తామని చెప్పారు. అలాగే చేశారు కూడా. అందుకు చాలా కారణాలున్నాయి. అన్నిటికంటే పెద్ద కారణం వాణిజ్యమే. మేం భారత్, పాకిస్థాన్‌లతో చాలా వాణిజ్యాన్ని చేయబోతున్నాం. భారత్‌తో ఇప్పటికే చర్చలు జరుపుతున్నాం. త్వరలో పాకిస్థాన్‌తోనూ మాట్లాడతాం. అణు యుద్ధాన్ని మేమే నివారించాం. ఇరు దేశాల మధ్య సైనిక ఘర్షణ అణు యుద్ధంగా మారి ఉండేదని నేను భావిస్తున్నాను. లక్షల మంది మరణించేవారు. విపత్తును నివారించినందుకు గర్విస్తున్నాను. ఈ విషయంలో మా ఉపాధ్యక్షుడు వాన్స్, విదేశాంగమంత్రి మార్కో రూబియోలు చాలా కష్టపడ్డారు. వారికి కృతజ్ఞతలు'' అని ట్రంప్ అన్నారు.

### భారత్-పాక్ ప్రత్యక్ష చర్చలకు మద్దతు

భారత్‌పాక్‌ల మధ్య ప్రత్యక్ష చర్చలకు మద్దతిస్తామని అమెరికా ముందుకు వచ్చింది. అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో ఈ అంశంపై బ్రిటన్ విదేశాంగ శాఖ మంత్రి డేవిడ్ లామీతో మాట్లాడారు. కాల్పుల విరమణ కొనసాగించడం, రెండు దేశాల మధ్య కమ్యూనికేషన్ మార్గాలను తెరిచి ఉంచడం ఎంతో ముఖ్యమని ఇరువురు నేతలు అభిప్రాయపడినట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ తెలిపారు. ఇరుదేశాలు ప్రత్యక్షంగా చర్చలు జరపడానికి అమెరికా సాయం చేస్తుందని రూబియో పునరుద్ఘాటించారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే ప్రయత్నాలను ప్రోత్సహిస్తామన్నారు.

### వాణిజ్యం ప్రస్తావనకే రాలేదు: భారత్

ఉద్రిక్తతలకు తెరదించని పక్షంలో వాణిజ్యం నిలిపేస్తామంటూ భారత్, పాకిస్థాన్‌లకు చెప్పామని.. ఈ క్రమంలోనే ఆ రెండు దేశాలూ కాల్పుల విరమణకు అంగీకరించాయంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యల్ని భారత్ తిప్పికొట్టింది. 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతున్న సమయంలో ఆయా సందర్భాల్లో అమెరికా ప్రతినిధులతో భారత ప్రతినిధులు ఫోన్‌లో మాట్లాడారని.. ఎక్కడా వాణిజ్యం ప్రస్తావన రాలేదని స్పష్టం చేసింది. ''కాల్పుల విరమణకు, వాణిజ్యానికి సంబంధం లేదు'' అని అధికార వర్గాలు తెలిపాయి.

## రాష్ట్రంలోని స్థానికేతర కోటా ఇక పూర్తిగా మనవాళ్లకే

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించనున్నారు. ఫలితంగా 202526 విద్యా సంవత్సరంలో స్థానికేతర కోటా 15% సీట్లనూ రాష్ట్ర విద్యార్థులే పొందనున్నారు. ఇప్పటి వరకు ఈ సీట్లలో తెలంగాణకు చెందిన వారికి అవకాశం కల్పిస్తుండగా.. ఇక నుంచి ఈ సీట్లకు పోటీ పడటానికి తెలంగాణ, ఇతర రాష్ట్రాల వారికి అవకాశం ఉండదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఉన్నత విద్య, వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలు, ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిబంధనల్లో స్థానిక, స్థానికేతరను స్పష్టం చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం వేర్వేరుగా మూడు ఉత్తర్వుల (జీవో20, 21, 22)ను జారీ చేశారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం అక్కడి వర్సిటీల్లోని 15% కోటాలో ఏపీ వారికి అవకాశం లేకుండా ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం సైతం ఇక్కడి వర్సిటీల్లో తెలంగాణ వారికి అవకాశం లేకుండా ఉత్తర్వులు జారీ చేసింది. కన్వీనర్ కోటా సీట్లు 70%లో 85% సీట్లను స్థానికులకు కేటాయిస్తారు. స్థానికత ఏపీలో రెండు రీజియన్‌లుగా ఉంటుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం రీజియన్‌లుగా దీన్ని నిర్ణయిస్తారు. ఉమ్మడి ఏపీ, విభజన అనంతరం 10 ఏళ్ల పాటు ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర, ఉస్మానియా రీజియన్లుగా సీట్ల భర్తీ చేపట్టగా.. ఇప్పుడు ఉస్మానియా రీజియన్‌ను తొలగించారు. ఇక నుంచి ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర రీజియన్‌ల వారీగా మాత్రమే సీట్లను భర్తీ చేయనున్నారు.

### ఆంధ్ర రీజియన్‌లో ఎవరొస్తారంటే..

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు ఆంధ్ర రీజియన్(ఏయూ) పరిధిలో ఉంటాయి. ఇక్కడి విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులను ఏయూ రీజియన్‌కు లోకల్‌గా పరిగణిస్తారు.

## బుద్ధవనంలో ముద్దుగుమ్మలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంగణంలో సందడి చేశారు. గౌతముడి మహాపాదుకలకు పుష్పాంజలి ఘటించి, మహాస్తూపంలో ధ్యానం చేశారు. జాతకవనంలో బుద్ధుడి జీవనక్రమాన్ని తెలిపే శిల్పాలను చూసి అచ్చెరువొందారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి 2025 పోటీల్లో పాల్గొంటున్న ప్రపంచ దేశాల భామలు బుద్ధపూర్ణిమను పురస్కరించుకుని నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లోని బుద్ధవనం ప్రాజెక్టును సోమవారం సాయంత్రం సందర్శించారు. 110కి పైగా దేశాల సుందరీమణులు పాల్గొంటున్న ఈ పోటీలు శనివారం ప్రారంభమైన తర్వాత ఏర్పాటు చేసిన మొదటి పర్యటన ఇది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక సంపదను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆసియా, ఓషియానా దేశాలకు 22 మంది భామలు పాల్గొన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ, నల్గొండ జిల్లా యంత్రాంగం జానపద, గిరిజన నృత్య కళాకారులతో వారికి సాదరంగా స్వాగతం పలికింది.

### పర్యటన సాగిందిలా..

హైదరాబాద్ నుంచి పర్యాటక శాఖ ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన పోటీదారులు మధ్యాహ్నం 3 గంటలకు నల్గొండ జిల్లా చింతపల్లి సమీప అతిథిగృహానికి చేరుకొని కాసేపు ఆగారు. అక్కడి నుంచి నాగార్జున సాగర్‌లోని విజయవిహార్ అతిథిగృహానికి చేరుకున్నారు. నాగార్జునసాగర్ చెంత ఫొటోషూట్ ముగించుకుని సాయంత్రం 6గంటలకు బుద్ధవనానికి వచ్చారు. అనంతరం మహాస్తూపం వద్ద కూడా ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా హలో వరల్డ్ నమస్తే.. తెలంగాణ జరూర్ ఆనా అంటూ నినాదం ఇచ్చారు. స్తూపంలోకి వెళ్లి బౌద్ధ భిక్షువులతో కలిసి ధ్యానం చేశారు. సాయంత్రం 7గంటల నుంచి జాతకవనంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆస్వాదిస్తూ... స్థానిక కళాకారులతో కలిసి కాసేపు నృత్యం చేశారు. ఎల్ఈడీ తెరపై తెలంగాణలో బౌద్ధం గురించి వీడియో ప్రదర్శన వీక్షించారు. ఈ ప్రాంత ప్రాముఖ్యతను ప్రాజెక్ట్ కన్సల్టెంట్ ఈమని శివనాగిరెడ్డి అతిథులకు వివరించారు. ఇక్కడే ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు అనంతరం సుందరీమణులు చింతపల్లి మీదుగా హైదరాబాద్ చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యేలు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ సుందరీమణులు మంగళవారం సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు చార్మినార్ నుంచి లాడ్‌బజార్ వరకు హెరిటేజ్ వాక్ చేయనున్నారు. 6 నుంచి 9 గంటల వరకు చౌమొహల్లా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొంటారు.

## పాకిస్థాన్ అణు స్థావరాలను భారత క్షిపణులు తాకాయా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రసక్తే లేదన్న సందేశం ఇచ్చేందుకే ఆ దాడులను భారత్ కచ్చితత్వంతో నిర్వహించిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మే 9 అర్ధరాత్రి, 10వ తేదీన పాకిస్థాన్‌లోని కీలక వాయుసేన స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశామని భారత్ ప్రకటించింది. పూర్తి స్వదేశీ ఆయుధాలతో దాడి చేసి 11 వాయుసేన స్థావరాలను దెబ్బతీసినట్లు తెలిపింది. వీటిలో ఒక దాడి పాక్ న్యూక్లియర్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాంగణంలో జరిగినట్లు తెలుస్తోంది. పాక్ చెప్పుకొంటున్న ప్రధానబలం అణ్వస్త్రం. ఆ బలంపైనే దాడి చేస్తే దేశ నాశనం తప్పదని పాక్ సైనిక నాయకత్వం వెన్నులో వణుకుపుట్టి అమెరికాను ఆశ్రయించిందన్న వాదన వినిపిస్తోంది. ఈ వాదనల్లో నిజానిజాలను ఇటు భారత్ గానీ, అటు పాకిస్థాన్ గానీ నిర్ధరించలేదు. ఈ విషయంపై అంతర్జాతీయ మీడియా సహా సోషల్ మీడియాలో సైనిక వ్యవహారాల నిపుణులు చేసిన చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సమీపంలో ఇండియన్ ఆర్మీ ప్రిసిషన్ స్ట్రైక్స్ చేసింది. దానికి అతి చేరువలో పాక్ న్యూక్లియర్ కమాండ్ కంట్రోలు ఉంది. అణ్వాయుధాలను నియంత్రించడం, నిల్వ చేయడంలో దీని పాత్ర అత్యంత కీలకం. దీనికి అతి సమీపంలో దాడి చేయడమంటే పాకిస్థాన్ అణ్వాయుధాలను క్షణాల్లో భారత్ ధ్వంసం చేయగలదన్న సందేశం ఇచ్చినట్లే అని రాండ్ కార్పొరేషనుకు చెందిన డెరెక్‌జే గ్రోస్మన్ అనే మిలిటరీ వ్యవహారాల నిపుణుడు చెప్పారు. ఇది అన్ని లక్ష్యాల పైనా అత్యంత కచ్చితమైన దాడులను నిర్వహించే సత్తా భారత్‌కు ఉందని చెప్పడమేనని వివరించారు. అమెరికా జోక్యానికి ముందు భారత్, పాక్ ఘర్షణ అతిప్రమాదకరంగా ఉందని.. ఆ దాడుల తర్వాతే అమెరికా రంగంలోకి దిగి కాల్పుల విరమణ చేసుకోవాలని సర్దిచెప్పినట్లు ఆయన వెల్లడించారు.

### భారత్ లక్ష్యం అదే

సర్గోదాలోని కీలక ఎయిర్‌బేస్ కిరానా హిల్స్‌ను భారత్ లక్ష్యంగా చేసుకొంది. కీలక ఆయుధాలను మోహరించే ఈ స్థావరంపై బాంబులు, క్షిపణులు, డ్రోన్లతో అత్యంత కచ్చితత్వంతో విరుచుకుపడినట్లు భారత్ అధికారిక ప్రకటన చేసింది. ఈ బేస్‌లోనే అణు వార్‌హెడ్లను సైతం పాక్ నిల్వ చేసి ఉంచింది. ఇక్కడ భారత్ దాడులను పాక్ పత్రిక 'డాన్' ధ్రువీకరించిందని ఈథన్ అనే ఓ పరిశీలకుడు 'ఎక్స్'లో పోస్టు చేశారు. పాక్ అణ్వస్త్రాల భద్రతకు అమెరికాతో అవగాహన ఉందని, అందుకే తొలుత వాషింగ్టన్‌ను పాక్ ఆశ్రయిస్తుందని 'న్యూయార్క్ టైమ్స్' గతంలో ప్రచురించిన ఓ కథనాన్ని ఆయన పోస్టు చేశారు. దీంతో ఆందోళన చెందిన అమెరికా వెంటనే భారత్‌తో సంప్రదింపులు జరిపిందన్నారు. పాక్ రెచ్చగొడితే మరింత విధ్వంసకరంగా ప్రతిస్పందిస్తామని భారత్ ఇప్పటికే తేల్చి చెప్పింది. చివరకు భారత్ దాడుల తీవ్రతకు వణికిపోయిన పాక్ కాళ్లబేరానికి వచ్చినట్లు తెలుస్తోంది. భారత్ మొదటి లక్ష్యం ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయడమే కానీ, పాక్ సైనిక స్థావరాలు కాదు. లక్ష్యం నెరవేరడంతో కాల్పుల విరమణకు భారత్ అంగీకరించినట్లు సమాచారం.

### 3 గంటల్లో ఖేల్ ఖతం

11 పాకిస్థానీ వాయు స్థావరాలపై ప్రెసిషన్ స్ట్రైక్స్‌ను కేవలం 3 గంటల్లోనే పూర్తిచేసినట్లు భారత సైన్యం ప్రకటించింది. వాటిలో నూర్‌ఖాన్ బేస్ ప్రధానమైంది. ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ సహా ఉన్నతస్థాయి జనరల్స్ ఇక్కడ భేటీ అవుతారు. గగనతల రీఫ్యూయలర్ ట్యాంకర్లు, భారీ రవాణా విమానాలు ఇక్కడే ఉంటాయి. అత్యాధునిక విమానాలకు కేంద్రం రఫీఖీ బేస్. ఇక్కడ అత్యవసర ల్యాండింగ్ స్ట్రిప్‌లు ఉన్నాయి. మురీద్ బేస్‌లో మానవరహిత డ్రోన్లను నిల్వ చేస్తారు. సర్గోదాను పాక్ అణునాడిగా చెబుతారు. భొలారీ స్థావరంపై భారత్ చేసిన దాడిలో పాక్‌కు చెందిన స్క్వాడ్రన్ లీడర్, నలుగురు వాయుసేన సిబ్బంది సహా 50 మంది చనిపోయారు. 20 శాతం మేర ఎయిర్‌ఫోర్స్ మౌలిక సదుపాయాలు, ఎఫ్16, జేఎఫ్17 ఫైటర్లు ధ్వంసమయ్యాయి.

## అశక్త సైన్యాధ్యక్షుడి అస్తిత్వ ఆరాటం!

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగ అధికరణం 370 రద్దు తర్వాత... కశ్మీర్‌లో పర్యాటకం భారీగా పుంజుకోవడంతో హోటళ్లు, రిసార్టులూ పెరిగాయి. యువతకు విద్య, ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. తొలిసారిగా దిల్లీశ్రీనగర్‌లను కలుపుతూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఆరంభించాలనీ భారత్ నిర్ణయించింది. కశ్మీర్ లోయలో సాధారణ పరిస్థితులు నెలకొనటం పాక్ ప్రభుత్వం, సైన్యంలోని ఉగ్రవాద మద్దతుదారులకు కంటగింపుగా మారింది. నిజానికి పాకిస్థాన్‌లోని పాలకులు, సైనికాధికారులందరూ కశ్మీర్ విషయంలో భారత్‌తో కఠిన వైఖరి అవలంభించలేదు. గతంలో పాకిస్థాన్ వైమానిక దళాధిపతిగా ఉన ఎయిర్‌చీఫ్ మార్షల్ జుల్ఫికర్ అలీఖాన్‌లాంటి వారు.. 'కశ్మీర్‌ను భారత్ నుంచి తీసుకోలేం.

# ఫాసిజం నుండి ప్రపంచ ప్రజల్ని కాపాడిన ఎర్రజెండా

*** నయా ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం**

*** సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఫాసిజం నుండి ప్రపంచ ప్రజల్ని ఎర్రజెండా కంటికి రెప్పలా కాపాడుకుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. స్థానిక మంచికంటి భవన్లో ఫాసిజం పై కమ్యునిజం విజయం సాధించి ఎనబై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడానికి కారణం ఫాసిజం దీన్ని సోవియట్ సైన్యం వీరోచితంగా పోరాడి వెనక్కికొట్టిందనీ ఈ ఓటమిని తట్టుకోలేక ఫాసిస్టు హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడనీ అన్నారు. మే 9న జర్మన్ రిచ్‌స్టార్గ్ భవనం మీదకు ఎర్ర సైనికులెక్కి ఎర్రజెండా ఎగురవేశారని అన్నారు. ఎర్రజెండా త్యాగాల వల్ల ఫాసిస్టు నియంతృత్వం నుండి ప్రజలను కాపాడుకోగలిగామనీ తద్వారా ప్రపంచంలో అనేక జాతీయ విముక్తి ఉద్యమా లకు ఊపు వచ్చిందనీ అన్నారు. దీని ప్రభావం భారతదేశపు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తీవ్రంగా పడిందన్నారు. ఇండియా స్వతంత్రం సాధించిన తర్వాత తన కాళ్లపై నిలబడి ఎదగడానికి సోవియట్ రష్యా సహకారం అందించిందనీ మనదేశం శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయక, మిలిటరీ, రోదసీ రంగాల్లో వేగంగా సార్వభౌమరాజ్యంగా ఎదగటానికి సోషలిస్టు రష్యా ఉపయోగపడిందనీ అన్నారు. ఫలితంగానే మన దేశానికి వ్యతిరేకంగా అమెరికా చేస్తున్న



కుట్రలను ఎదిరించి ఎదిగిందనీ అన్నారు. మనదేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి, మైనార్టీలను టార్గెట్ చేసి మెజారిటీ ప్రజల్లో అసహనం, విద్వేషం రెచ్చగొట్టే చర్యలు పెరిగాయనీ అన్నారు. మైనింగ్,ఖనిజాలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే అడవులను నిర్మూలించి, ఆదివాసీలను తరిమేసే కుట్రపూరిత చర్యల్ని ఎక్కువయ్యాయనీ ఆరోపించారు. రైతులు, కార్మికుల మీద, వారి పోరాటాల మీద, వారి హక్కులు, సదుపాయాల మీద దాడి అంతకంతకూరెట్టింపయ్యాయనీ విమర్శించారు. మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ఏజె రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అన్నవరపు సత్యనారాయణ తెపాకుల శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ దొడ్డ రవి కొండబోయిన వెంకటేశ్వర్లు భూక్య రమేష్ యాసా నరేష్ నాయకులు తులసీరామ్ డి వీరన్న సందకూరి లక్ష్మి నందిపాటి రమేష్ ఇందిరా నిరంజన్ రాజారావు ఎంఎస్ ప్రకాష్‌పద్మ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్, జాతీయ బిసి సంక్షేమ సంఘం నేతకు సన్మానం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మార్కెట్ కమిటీ డైరెక్టర్ కదిరే సత్య గౌడ్, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి గౌడ్‌ను గోపా ముస్తాబాద్ అధ్యక్షుడు పరశురామ్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి, పూలబొకే అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్, మండల కార్యదర్శి అశోక్ గౌడ్, భదవేని అంజా గౌడ్, పదిరే రాజు గౌడ్, నవీన్ గౌడ్, ప్రశాంత్ గౌడ్ తదితరులున్నారు.

## ఘనంగా సుందరకాండ హోమం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని బంధానకల్ హనుమాన్ భక్త మండలి సభ్యులు స్థానిక వాసుదేవ్ ఆశ్రమ దేవాలయంలో ఘనంగా హనుమాన్ సుందరకాండ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు రేపాక రామశర్మ, రాజేందర్ శర్మ ఆధ్వర్యంలో ఈ హోమాన్ని చేపట్టారు. హనుమాన్ దీక్షాపరులు ఈ హోమంలో పాల్గొన్నారు.

## ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) :బుద్ధ పూర్ణిమ ను పురస్కరించుకొని హెచ్ ఎల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బుద్ధ పూర్ణిమ వేడుకలు అంబేద్కర్ భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి హేచ్ ఎల్ డీజీమ్ హెచ్.ఆర్ సూర్యకుమార్ రౌత్ విచ్చేసి బుద్ధుడికి పూలతో నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు బోదించిన సూక్తులు ప్రపంచంలో అందరు పాటిస్తున్నారన్నారు. శాంతి ని నెల కొల్పడం లో ఆయనను మించినవారు లేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో హెచ్ఆర్ సియం ఐఆర్ ప్రహలాద్,సీనియర్ మేనేజర్ సత్యనారాయణ, రికగ్నిసెడ్ రికగ్నైస్డ్ యూనియన్ అధ్యక్షులు వేంకటాద్రి, గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, అసోసియేషన్ అధ్యక్షులు పట్టు రమేష్ కుమార్, ప్రధానకార్యదర్శి శశికుమార్,ఏస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చూడమన్,రవికుమార్ ముదిరాజ్, శ్రీనివాస్ బాబు,నాగార్జున,విజయశ్రీ, పద్మ,లక్ష్మణ్, తిమ్మయ్య, విష్ణు,ప్రేమ్,మురళి,రామకృష్ణ,శ్రీధర్,రమేష్,జోగారావు,ప్రవీణ్, రాంబాబు, బిలియా,తదితరులు పాల్గొన్నారు




## గీత గణేషన్ సిల్వ జూబ్లీ కార్యక్రమంలో మహాదేవ్ ట్రస్ట్ సేవలు

**- సాంఘిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్న మహదేవ్ ట్రస్ట్ సేవా సమితి**

**- సేవా కార్యక్రమాలు చేయడమే ప్రధాన ధ్యేయం - మహదేవ్ ట్రస్ట్**

**- భవిష్యతులో నిరుపేదలకు అందుబాటులో ఉండే విధంగా అడుగులు**

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గుర్తించబడ్డ మహాదేవ సేవ ట్రస్ట్ పలు ఉత్సాహక కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగానే ఉత్తర సెంటర్ ఫర్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ వారి 25వ వార్షికోత్సవ కార్యక్రమంలో మహాదేవ్ సేవా ట్రస్ట్.ఉత్తర సెంటర్ ఫర్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఫౌండర్ గీతా గణేషన్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమం రవీంద్ర భారతి లో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమనికి వాలంటరీగా మహాదేవ్ సేవా ట్రస్ట్ కమిటీ సభ్యులు సేవలందించారు. వాలంటీర్ గా సేవ చేసుకునే అవకాశం ఇచ్చినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ఈ జనరేషన్ వారు మన భారత సంస్కృతిని మర్చిపోతున్న తరుణంలో ఫౌండర్ గీతా గణేశన్ గారు పిల్లలకు భారత సంస్కృతి భరత నాట్యం నేర్పించడం చాలా మంచి విషయం . తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహించడం చాలా గర్వకారణం.వీళ్ళందరికీ ట్రస్ట్ తరపున నమస్కారములు తెలిపారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సముద్రాల వేణుగోపాల చారి , సినీ యాక్టర్స్ తనికెళ్ల భరణి, వినయ్ వర్మ తదిరులు పాల్గొన్నారు ట్రస్ట్ సభ్యులు వేముల రాకేష్ మాధవరావు గారు కొండపల్లి రాకేష్ హరి కురునాథ్ ,శివరాజు, సుజాత, ప్రసన్న, సునీత తదిరులు పాల్గొన్నారు.

## ఘనంగా బుద్ధ పూర్ణిమ

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: బుద్ధ జయంతి సందర్భంగా బుద్ధ పూర్ణిమ వేడుకలను సోమవారం బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరంలోనీ బౌద్ధ ఆరామాల వద్ద నిర్వహించిన బుద్ధ జయంతి వేడుకల్లో పలువురు బుద్దిస్టులు పాల్గొని మాట్లాడారు. బుద్ధుడు చేసిన బోధనల గురించి వివరించారు. ప్రతీ ఒక్కరు బుద్ధుని మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా బుద్ధుని ఆరామాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కారుకొండలోని బౌద్ధ ఆరామాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి విన్నవించాలని అన్నారు. అనంతరం వందమందికి పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఐ జిల్లా అధ్యక్షురాలు కొచ్చర్ల కమలా రాణి, సింగరేణి జీఎం కవిత నాయుడు , మాజీ జీఎం శనగ వెంకటేశ్వర్లు, ఎస్సీ ఎస్టీ యూనియన్ నాయకులు



అంతోటి నాగేశ్వరరావు, సింగరేణి డాక్టర్ ఇన్నయ్య , సింగరేణి జీఎం మేకల కనకయ్య , సింగరేణి జీఎం బత్తుల శ్రీనివాసరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తుంపురు శివ, సింగరేణి ఏజీఎం గోనె శ్రీకాంత్, డీజీయం అజయ్, డీజీఎం, కైరో ప్రాక్టర్ సుగుణ రావు, తుడుందెబ్బ నాయకులు కొమరం బుచ్చయ్య, మాదిగ జేఏసీ నాయకులు వేల్పుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రాందేవరావ్ ఆసుపత్రిలో ఘనంగా ఇంటర్నేషనల్ నర్సుల దినోత్సవం



కూకట్పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆరోగ్య పరిరక్షణ విభాగంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమైనదని హార్టికల్చర్ లక్ష్మీ కమలాకర్ అన్నారు. ఇంటర్నేషనల్ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కూకట్ పల్లి రాందేవరావ్ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమెతో పాటు గ్రాండ్ మాస్టర్ రేఖ తెరపి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చారు. మెడికల్ డైరెక్టర్ డా. కమలాకర్ మాట్లాడుతూ రాందేవరావ్ ఆసుపత్రిలోని నర్సులు అందరు కూడా ఒక ఫ్లోరెన్స్ నైటింగేల్, ఒక మదర్ థెరిస్సా, ఒక సిస్టర్ నిర్మల ను ఆదర్శంగా తీసుకొని నర్సులు వాళ్ల అడుగుజాడల్లో నడవాలని అన్నారు.. నర్సులు అందించే సేవలు దైవికమైనవన్నారు. నర్సింగ్ వృత్తిని నోబెల్ ప్రొఫెషన్ అంటారన్నారు. గత 17 సంవత్సరాలుగా ఇంటర్నేషనల్ నర్సింగ్ దినోత్సవాన్ని అత్యంత ఉన్నతంగా, వైభవంగా జరుపుతున్నామన్నారు. నర్సులను సత్కరించడం అంటే దేవుడిని సత్కరించడంతో సమానమన్నారు. ఇలాంటి విషయాల్లో రాందేవరావ్ ఆసుపత్రి ఎప్పుడు ముందుంటుందన్నారు. మన భారతీయ సాంప్రదాయం ప్రకారం పెద్దల్ని గౌరవించడం అనేది ఒక ఆచారం. అందులో భాగంగా విశ్రాంతి నర్సులైన సిస్టర్స్ రాహేల్, కమల చార్లెస్, సరస్వతి లను, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ అర్చన మొరే ని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్లెడ్జ్ ను రాందేవ్ అసిస్టెంట్ నర్సింగ్ సువరింటెండెంట్ పి.శోభ రాణి అందరితో విజయవంతంగా చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నర్సులను, శివానంద రిహాబిలిటేషన్ నర్సులను, కుముదుని దేవి నర్సింగ్ కాలేజ్ సిబ్బందిని, విద్యార్థినిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి డాక్టర్లు, స్పెషల్ డాక్టర్లు, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఆసుపత్రి సీఈవో యోబు తెలిపారు.

## అపార్ట్మెంట్ వాసులు ఐకమత్యంగా ఉండి సమస్యల పరిష్కారానికై కృషి చేయాలి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ( ప్రజాస్ఫూర్తి) : అపార్ట్మెంట్ వాసులు కలిసికట్టుగా ఐకమత్యంగా ఉండి సమస్యల పరిష్కారానికై కృషిచేయాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. షాపూర్ నగర్ టీఎస్ఐఐసీ"ఎలైట్ కౌంటీ" అపార్ట్ మెంట్ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంక్షేమ సంఘ కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, నూతన అధ్యక్షులు మహమ్మద్ సిద్దిక్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రావు, జనరల్ సెక్రెటరీ పిల్లి శంకర్, కోశాధికారి నరేష్ కుమార్, సంయుక్త కార్యదర్శి కృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు రషీదుల్లా ఖాన్, సతీష్, రవీంద్రనాథ్, నాగ తేజ, ఎం.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## కోపంతో కాకుండా శాంతి, సహనంతో ప్రపంచాన్ని జయించవచ్చు

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కోపంతో కాకుండా శాంతి, సహనంతో ప్రపంచాన్ని జయించవచ్చని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్ లోని "నక్షిణ్ బుద్ధ విహార్" దేవాలయంలో నిర్వహించిన బుద్ధ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాహ్య శత్రువుల కంటే, మన అంతర్గత అహంకారాన్ని జయించడం గొప్ప విజయమన్నారు. మానవాళికి దిశానిర్దేశం చేసిన గొప్ప మార్గదర్శకులు గౌతమ బుద్ధుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, బుద్ధ దేవాలయం కమిటీ అధ్యక్షులు యశ్వంత్ జోన్దేల్, ఉపాధ్యక్షులు భీమ్ రావు కాండే, ప్రధాన కార్యదర్శి దిలీప్, జే. గౌతమ్, డబ్ల్యూ. దమ్మానం, కె. బాలాజీ, నాయకులు పెద్ద వెంకట స్వామి, గుబ్బల లక్ష్మీనారాయణ, కావలి రవి, వల్లీ భాయ్, జాంగీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో వైభవంగా వైశాఖ పౌర్ణమి గరుడసేవ

తిరుమల: తిరుమలలో సోమవారం వైశాఖ పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు సాగిన ఈ వేడుకలో స్వామివారు తనకు ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమాడ వీధులు గోవిందనామస్మరణతో మార్మోగాయి. ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో నాలుగు మాడ వీధుల్లో భజనలు, కోలాటాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, తితిదే బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మి, డిప్యూటీ ఈవో శ్రీలోకనాథం పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేయాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు . సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో



అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.గంజాయి వంటి మత్తు పదార్థాలు,మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు.ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు.రాబోయే వర్షాకాలంలో అధిక వర్షాలు సంభవించినపుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే విధంగా ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి,భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు.మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, జిల్లాలోని ఇన్స్పెక్టర్స్ , సిబ్బంది పాల్గొన్నారు.

## మతతత్వ పార్టీల పట్ల
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

*** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సీపీఐ కార్యదర్శి సాయిల్ గౌడ్**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మతతత్వ పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సీపీఐ కార్యదర్శి సాయిల్ గౌడ్ అన్నారు. సోమవారం కూకట్ పల్లి మండలం సీపీఐ పార్టీ 4వ మహాసభలు శ్రీశ్రీనగర్లోని సాగర సంఘం కమ్యూనిటీ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన తో పాటు జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్లు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మిత్ర పక్షమైన ప్రజల సమస్యల పరిష్కారం కోరకు రాజీలేని పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం 15 మందితో మండల కమిటీ ఏర్పాటు చేశారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూం అర్హత కలిగిన వారికి కేటాయించాలన్నారు. అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం



కూకట్ పల్లి మండల కమిటీ సెక్రటరీగా జి.కృష్ణ, కె.మనోచారి, కృష్ణచారి, దావిడ్, శివ ప్రసాద్, కొండల్ రావు, రాములు, నారాయణ, చంద్రమ్మ, ఉమారాణి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు ప్రాంతాల ప్రజలు తిరిగి వచ్చేయండి

**: సీఎం ఒమర్ అబ్దుల్లా**

కాల్పులతో దద్దరిల్లిన సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొంటున్న తరుణంలో జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. ఇటీవల సరిహద్దు గ్రామాలను ఖాళీ చేసి వేరే చోటకు తరలివెళ్లిన ప్రజలు తిరిగి తమ సొంత నివాసాలకు రావాలని సూచించారు. భారత్ పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల వల్ల ప్రభావితమైన పలు ప్రాంతాల్లో సీఎం ఒమర్ పర్యటించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ''ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది. సరిహద్దు ప్రాంతాల ప్రజలు తిరిగి తమ సొంత ఇళ్లకు



చేరాలి. ఉద్రిక్తతలతో పూంఛ్ జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. కాగా, ఈ జిల్లాలో సుమారు 80 నుంచి 90 శాతం వరకు ప్రజలు తమ నివాసాలను ఖాళీ చేశారు. వారు తప్పకుండా తిరిగి రావాలి'' అని సీఎం పేర్కొన్నారు. కాగా.. ఇటీవల పాక్ కాల్పులతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను సీఎం ఒమర్ పరామర్శించారు. ''పాకిస్థాన్ సైన్యం కాల్పుల్లో దాదాపు 13 మందికి పైగా పౌరులు మృతి చెందారు. బాధితులను పరామర్శించడానికే నేను ఇక్కడికి వచ్చాను. రాష్ట్రంలోని పూంఛ్, రాజౌరి, జమ్మూ, బారాముల్లా, కుప్వారా, బందిపొరా జిల్లాల్లో జరిగిన నష్టాలను అంచనా వేసి నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాను. మృతుల కుటుంబాలకు ఈ నివేదిక ప్రకారం నష్ట పరిహారం అందిస్తాం. ఉద్రిక్తతల సమయంలో సీనియర్ అధికారులపై వచ్చిన వదంతులను నమ్మొద్దు'' అని ఆయన సూచించారు.

# ఆపరేషన్ సిందూర్.. దేశ వ్యాప్తంగా భాజపా 'తిరంగా యాత్ర'!




దిల్లీ: పాకిస్థాన్ ఉగ్రమూకల పీచమణిచేందుకు భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడంతో భాజపా కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా తిరంగా యాత్ర పేరిట రేపట్నుంచి 11 రోజుల పాటు క్యాంపెయిన్ చేపట్టనుంది. మే 13న ప్రారంభం కానున్న ఈ తిరంగా యాత్ర ఈ నెల 23వరకు కొనసాగనుంది. ప్రధాని మోదీ నాయకత్వ పటిమ, సాయుధ దళాల పరాక్రమాన్ని ప్రజలకు వివరించేలా ఈ క్యాంపెయిన్ కొనసాగనుంది. తిరంగా యాత్ర నిర్వహణపై చర్చించేందుకు కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు పలువురు పార్టీ అగ్రనేతలు ఆదివారం సమావేశమయ్యారు. తాజాగా సోమవారం కూడా తరుణ్ చుగ్, వినోద్ తావ్డే, దుశ్యంత్ గౌతమ్‌లతో సమావేశమైన నడ్డా తుది కసరత్తు పూర్తి చేశారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత సైన్యం విజయవంతంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం నేపథ్యంలో చేపట్టబోయే ఈ క్యాంపెయిన్‌లో సమాజంలోని పలువురు ప్రముఖులతో పాటు ప్రజలను సమీకరించనున్నట్లు భాజపా నేతలు తెలిపారు. ఈ యాత్రలో పలువురు కేంద్రమంత్రులు, భాజపా నేతలు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

# కిరానా హిల్స్‌ను టార్గెట్ చేయలేదు..
## పాక్ గురించి ఆ విషయం చెప్పినందుకు థ్యాంక్స్

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌ను లక్ష్యంగా చేసుకోలేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏకే భారతి వెల్లడించారు. పాకిస్థాన్‌లోని అణుస్థావరాన్ని భారత్ లక్ష్యంగా చేసుకున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని తోసిపుచ్చారు. ఆపరేషన్ సిందూర్‌పై త్రివిధ దళాల అధికారులు నిర్వహించిన సమావేశంలో ఈ అసత్య ప్రచారంపై స్పష్టత ఇచ్చారు. ''పాకిస్థాన్ తన అణ్వాయుధాలను కిరానా హిల్స్ వద్ద నిల్వ చేస్తుందని చెప్పినందుకు థ్యాంక్స్. అక్కడ ఏమైనా ఉండనీ.. మేం మాత్రం ఆ హిల్స్‌ను టార్గెట్ చేయలేదు. మేం లక్ష్యంగా చేసుకున్నామని చెప్పిన జాబితాలో అది లేదు'' అని ఎయిర్ చీఫ్ మార్షల్ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ అణు స్థావరంపై




దాడి గురించి అనేక వార్తలు చక్కర్లు కొట్టాయి. అణ్వాయుధాలను నిల్వచేసి ఉండొచ్చని చెప్తున్న హిల్స్.. సర్గోధా వైమానిక స్థావరానికి దగ్గర ఉన్నాయని వాటి సారాంశం. ఆ వైమానిక స్థావరాన్ని భారత్ టార్గెట్ చేసినట్లు మన సైన్యం ధ్రువీకరించగానే ఆ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. పాక్‌లో ఇటీవల సంభవించిన భూకంపాలకు.. అణు నిల్వలు ఉంచిన ప్రదేశాన్ని ఢీకొట్టడానికి ముడిపెట్టిన సిద్ధాంతాలు చక్కర్లు కొట్టాయి. వీటన్నింటికి తాజాగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఏకే భారతి చెక్ పెట్టారు. పాకిస్థాన్ సేనలు ఉగ్రవాదులకు అండగా నిలిచాయని, ఈ పోరాటాన్ని తమ పోరాటంగా మలచుకున్నాయని పేర్కొన్నారు. దీంతో భారత సైన్యం దీటుగా జవాబు ఇచ్చిందని చెప్పారు. పాకిస్థాన్ సైన్యానికి ఏదైనా నష్టం వాటిల్లితే దానికి వారే బాధ్యులని స్పష్టం చేశారు. పాకిస్థాన్ దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయని, దాయాది ఆటలు సాగనివ్వలేదన్నారు. అనంతరం పాక్‌లోని నూర్‌ఖాన్, రహీమ్‌యార్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను ప్రదర్శించారు.

# భారత జర్నలిస్టులకు పాక్ గూఢచారుల వల!

భారత్‌పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి ఇరుదేశాలు ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో పాక్ గూఢచారులు మాత్రం భారత రహస్యాలను తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు తాము భారత్ రక్షణ శాఖ అధికారులుగా పేర్కొంటూ జర్నలిస్ట్‌లకు (డిఫెన్స్) ఫోన్ చేసి 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించి సైనిక అధికారులు చేసే బ్రీఫింగ్, పాక్ విషయంలో చేసే ప్రణాళికలు మొదలైన సమాచారాన్ని సేకరిస్తున్నారని భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాక్ దాడిలో భారత్‌లోని ఏయే ప్రాంతాల్లో ఎంత నష్టం జరిగిందనే విషయాలపై కూడా వారు ఆరా తీస్తున్నట్లు వెల్లడించాయి. ఇతర జర్నలిస్టులు, పలువురు పౌరులకు కూడా గూఢచారుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నట్లు సమాచారం. ఈ కాల్స్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నుంచి వస్తున్నట్లు చూపిస్తున్నాయని.. కానీ, భారత అధికారులెవరూ అటువంటి కాల్స్ చేయరని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అటువంటి కాల్స్



వస్తే ఆన్సర్ చేయొద్దని.. తమకు సమాచారం ఇవ్వాలని సూచించాయి. ప్రస్తుతం భారత్ పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా నేడు ఇరుదేశాల 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో)ల మధ్య హాట్‌లైన్‌లో చర్చలు జరగనున్నాయి. భారత్, పాక్ చర్చల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, త్రివిధ దళాధిపతులు, పలువురు ఉన్నతస్థాయి సైనికాధికారులతో సమావేశమయ్యారు.

# ఆపరేషన్ సిందూర్ 100% సక్సెస్.. మోదీ వ్యూహాలు శత్రుదేశం ఊహకు కూడా అందవు: భాజపా

దిల్లీ: పహల్గాం ఉగ్ర ఘటన అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌కు భారత్ గట్టి జవాబిచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో సరిహద్దుల్లో వాతావరణం కాస్త ప్రశాంతంగా మారింది. ఈనేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వ పటిమను భాజపా కొనియాడింది. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంబిత్ పాత్ర దిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ వంద శాతం విజయవంతమైందని సంబిత్ పాత్రా పేర్కొన్నారు. ''మన సైన్యం వంద శాతం విజయం సాధించింది. అది కూడా నియంత్రిత, కచ్చితమైన చర్యల ద్వారా. పాకిస్థాన్‌లోని కీలక ప్రాంతాలను సైన్యం టార్గెట్‌గా చేసుకుంది'' అని ఆయన వివరించారు. పహల్గాం ఉగ్ర దాడి తర్వాత ప్రతీకారం తీర్చుకుంటామని



ప్రధాని నరేంద్ర మోదీ భారత ప్రజలకు హామీ ఇచ్చారని సంబిత్ పాత్ర పేర్కొన్నారు. నరేంద్ర మోదీ వ్యూహాలు శత్రుదేశం ఊహలకు కూడా అందవని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైన్యం తమ సత్తా చాటిందని పేర్కొన్నారు. ఇది అద్భుత విజయమని.. పాకిస్థాన్ భూభాగంలోని సుదూర ప్రాంతాలకు దూసుకెళ్లి.. శత్రు దేశ ఉగ్రవాద శిబిరాలను నిర్మూలించారని.. ఇది నయా భారత్ అని పేర్కొన్నారు. ఒక అణ్వాయుధ దేశం లోతుల్లోకి వెళ్లి దాడి చేయడం ఇదే మొదటిసారని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాని మోదీ ఐదు లక్ష్యాలను నిర్దేశించుకున్నారని సంబిత్ పాత్ర పేర్కొన్నారు. మొదటిది శత్రు భూభాగంలోని సుదూర ప్రాంతాలకు వెళ్లి దాడి చేయడం.. రెండోది ఉగ్రవాద శిబిరాలను నాశనం చేయడం.. మూడోది వాటిని పూర్తిగా నిర్మూలించడం.. నాల్గోది ఈ ప్రక్రియలో పౌరులెవరూ గాయపడకుండా చూసుకోవడం.. ఐదోది సైనిక మౌలిక సదుపాయాలపై దాడి చేయకుండా ఉండటమని వివరించారు. ఈసందర్భంగా భారత సైన్యం అజేయమైన శక్తిపాటవాలను ప్రదర్శించిందని.. ఉగ్రవాద శిబిరాలను నాశనం చేసిందని కొనియాడారు.

# సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో జీసీసీ హబ్‌గా హైదరాబాద్: సీఎం

హైదరాబాద్: సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ జీసీసీ హబ్‌గా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందన్నారు. కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించినట్లు






చెప్పారు. మరిన్ని ప్రపంచస్థాయి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని వివరించారు. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో అందరి సహకారం కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.




## ఆర్టీఐ కమిషనర్లను నియమించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: సమాచార హక్కుచట్టం (ఆర్టీఐ) కమిషనర్లుగా నలుగురిని తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఆర్టీఐ కమిషనర్లుగా పీవీ శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం భేటీ

హైదరాబాద్: రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. భారత్‌పాక్ ఉద్రిక్తతలు, దేశంలో జరిగిన పరిణామాల దృష్ట్యా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని పరిస్థితులను గవర్నర్‌కు ముఖ్యమంత్రి వివరించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.



## 20 మంది మావోయిస్టుల మృతి..
# కుటుంబ సభ్యులకు అప్పగింత

చర్ల: తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా ఉసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్ట కేంద్రంగా గత నెల 22 నుంచి 17 రోజుల పాటు మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భారీ ఆపరేషన్ జరిగిన సంగతి తెలిసిందే. ఇక్కడి అటవీ ప్రాంతంలో మే 7న జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన 20 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న భద్రత బలగాలు.. వాటిని బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం ప్రక్రియ ముగిసినట్లుగా పోలీసులు సోమవారం వెల్లడించారు. 11 మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మిగిలిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

**మావోయిస్టుల దుశ్చర్య**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు రెచ్చిపోయారు. జిల్లాలోని వేర్వేరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇన్ఫార్మర్ల నెపంతో ఆదివారం రాత్రి నలుగురు వ్యక్తులను కిరాతకంగా హత్య చేశారు. ఒకే రోజు జరిగిన ఈ ఘటనతో ఆయా ప్రాంతాల్లోని ఆదివాసీలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఘటనలపై పోలీసులు విచారణ చేపట్టారు.

## రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, వ్యయంపై
# శ్వేతపత్రం విడుదల చేయాలి: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. టీజీఐఐసీలో 1.75 లక్షల ఎకరాలను కేసీఆర్ అందుబాటులో ఉంచారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ భూమిని కుదువపెట్టాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ రహస్య జీవో ఇచ్చారని ఆరోపించారు. అన్ని భూములను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుదువపెట్టేలా జీవో తీసుకొచ్చారన్నారు. మరోవైపు కంచ గచ్చిబౌలి భూములను కుదువ పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. "టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారిస్తే ఎందుకు దాచారో సీఎం జవాబివ్వాలి.



స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టాక 1.75 లక్షల ఎకరాలకు ఎవరిది బాధ్యత? నిపుణుల సిఫార్సు లేకుండా చేస్తే జీవోను ఉపసంహరించుకోవాలి. భూములు కుదువ పెట్టి.. వచ్చిన డబ్బు పక్కదారి పట్టించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.1.80 లక్షల కోట్ల అప్పులు చేసింది. రూ.80 వేల కోట్లు మాత్రమే అప్పులు, వడ్డీల కోసం చెల్లించారు. మిగిలిన రూ.లక్ష కోట్లు ఎక్కడికి పోయాయి? ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

*** పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం..**

నేను పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నా. 47 నియోజకవర్గాల్లో పర్యటనలో వచ్చిన అభిప్రాయాలే చెబుతున్నా. పార్టీపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.. అది సరికాదు. సమయం వస్తే అన్నీ బయటకు వస్తాయి. నన్ను రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తాను. నాపై దుష్ప్రచారం విషయంలో పార్టీ స్పందిస్తుందని భావిస్తున్నా" అని కవిత తెలిపారు.

## గుజరాత్‌లో తెలంగాణ
# సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆపరేషన్

సూరత్: సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు గుజరాత్‌లో ఆపరేషన్ చేపట్టారు. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న 20 మందిని అరెస్టు చేశారు. సూరత్‌లో వారిని అరెస్టు చేసి హైదరాబాద్ తీసుకొచ్చారు. ఈ నిందితులపై తెలంగాణలో 60, దేశ వ్యాప్తంగా 515పైగా కేసులు నమోదై ఉన్నాయి. నిందితుల కోసం సూరత్ వెళ్లిన పోలీసులు.. రెండు బృందాలుగా విడిపోయి 10 రోజుల పాటు ఆపరేషన్ కొనసాగించారు. నిందితుల్లో ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, డీసీబీ బ్యాంకు



వాపి బ్రాంచ్ రిలేషన్‌షిప్ మేనేజర్ ఉన్నట్లు గుర్తించారు. పెట్టుబడుల పేరుతో, పార్ట్ టైం జాబ్ సహా ఇతర నేరాల కేసుల్లో వీరంతా నిందితులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి 20 మొబైల్స్, 28 సిమ్‌కార్డులు, 4 ఏటీఎం కార్డులు, 5 చెక్కుబుక్‌లు, 2 రబ్బర్ స్టాంపులు, ఇతర డాక్యుమెంట్‌లు స్వాధీనం చేసుకున్నారు.

## నాగార్జునసాగర్ బుద్ధవనంలో ప్రపంచ సుందరీమణులు

నాగార్జునసాగర్: మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రపంచ దేశాలకు చెందిన 22 మంది సుందరీమణులు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో పర్యటించారు. వారికి జానపద, గిరిజన నృత్య కళాకారులు ఘనస్వాగతం పలికారు. వారంతా అక్కడి పరిసరాలను చూసి అమితానందం పొందారు. బౌద్ధ థీమ్‌పార్క్‌లోని బుద్ధ విగ్రహాల వద్ద జరిగిన ధ్యానం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అంతకుముందు పర్యాటక సంస్థ విజయ్ విహార్‌లో కొంతసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం సుందరీ



మణులంతా ఫొటోషూట్‌లో పాల్గొన్నారు. బుద్ధపూర్ణిమను పురస్కరించుకొని వారంతా బుద్ధవన సందర్శనకు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇండియా, బంగ్లాదేశ్, కంబోడియా, మయన్మార్, వియత్నాం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేసియా, జపాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, లెబనాన్, మంగోలియా, నేపాల్, ఫిలిప్పీన్స్, సింగపూర్, శ్రీలంక, తుర్కియే, చైనా, థాయ్‌లాండ్, ఆర్మేనియా దేశాలకు చెందిన అభ్యర్థులు మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్నారు.

## మోడల్ స్కూల్ ఎంట్రన్స్ ఫలితాలు విడుదల

తెలంగాణ మోడల్ అడ్మిషన్ టెస్ట్ 2025 మార్కులు, ర్యాంకుల లిస్టును మోడల్ స్కూల్ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచినట్లు మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10 వ తరగతుల్లో ప్రవేశాలకు సంబంధించి గత నెల 27 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 40,331 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 30, 884 మంది హాజరయ్యారు. అందులో 9447 గైర్హాజరవగా 14473 మంది విద్యార్థులు పాసయ్యారు. మొత్తం 76.58 శాతం పరీక్ష రాస్తే 46.86 శాతం పాసయ్యారు. మోడల్ స్కూల్స్ అధికారిక వెబ్ సైట్ http://telanganams.cgg.gov.in లో విద్యార్థులు తమ ఫలితాలను చూసుకోవచ్చవని డైరెక్టర్ తెలిపారు.

## మీకు అధిక రక్తపోటు ఉంటే

# ఈ సప్లిమెంట్లను వెంటనే నివారించండి..

**ప్రపంచవ్యాప్తంగా 30–79 సంవత్సరాల వయస్సు గల 1.28 బిలియన్ల పెద్దలకు అధిక రక్తపోటు ఉందని అంచనా. అధిక రక్తపోటు, దీనిని హైపర్‌టెన్షన్ అని కూడా పిలుస్తారు. ఇది గుండెపోటు, స్ట్రోక్‌తో సహా తీవ్రమైన గుండె సమస్యలకు ప్రధాన కారణం. ఈ పరిస్థితిని నిర్వహించే వారికి, జీవనశైలి మార్పులు, మందులు తరచుగా వాడట కీలకం. అయితే కొన్ని ఆహార పదార్థాలు రక్తపోటు నియంత్రణలో జోక్యం చేసుకోవచ్చు. ఇది పరిస్థితిని మరింత దిగజార్చే అవకాశం ఉంది. మీకు అధిక రక్తపోటును నివారించాల్సిన ఐదు సప్లిమెంట్ నిపుణులు చెప్పినవి ఇప్పుడు చూద్దాం..**



### చేదు నారింజ..

బరువు తగ్గడానికి క్రీడా పనితీరుకు ఉపయోగించే ఆహార పదార్థం బిట్టర్ ఆరెంజ్ సారం, రక్తపోటు ఉన్నవారికి తగినది కాకపోవచ్చు. ఎందుకంటే ఇందులో ఎఫెడ్రిన్ లాంటి సమ్మేళనం సినెఫ్రిన్ ఉంటుంది. ఇది ఉద్దీపనగా పనిచేస్తుంది. ఇది రక్తపోటును పెంచుతుంది. ప్రమాదకరమైన గుండె లయలను ప్రేరేపిస్తుంది. రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులలో ఈ సప్లిమెంట్ గుండెపోటు, స్ట్రోక్ వంటి తీవ్రమైన సమస్యల సంభావ్యతను పెంచుతుంది.



### లైకోరైస్ వేరు...

జీర్ణ సమస్యలకు లేదా స్వీటెనర్‌గా సాధారణంగా ఉపయోగించే లైకోరైస్ రూట్, రక్తపోటు ఉన్నవారు దూరంగా ఉంచుకోవాల్సిన మరొక సప్లిమెంట్. ఈ సప్లిమెంట్‌లో రక్తపోటును పెంచే సమ్మేళనం గ్లైసిరైజిన్ ఉంటుంది. 2017 అధ్యయనం ప్రకారం, గ్లైసిరైజిన్ పొటాషియం స్థాయిలను తగ్గిస్తుంది. సోడియం నిలుపుదలని పెంచుతుంది. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. రక్తపోటు ఉన్నవారికి టీ లేదా సప్లిమెంట్లలో ఇది తక్కువ మొత్తంలో ఉండటం కూడా ప్రమాదాలను కలిగిస్తుంది.



### కెఫిన్ కలిగిన సప్లిమెంట్లు...

అధిక రక్తపోటు ఉన్నవారు కెఫిన్‌కు దూరంగా ఉండాలి. కాదు, కెఫిన్ మీ ఉదయం కాఫీ లేదా మధ్యాహ్నం టీలో మాత్రమే ఉండదు. శక్తిని పెంచే అనేక సప్లిమెంట్లలో ఇది ఒక సాధారణ పదార్థం. ఇటువంటి సప్లిమెంట్లు రక్తపోటులో తాత్కాలిక పెరుగుదలకు కారణమవుతాయి. ఇప్పటికే ప్రమాదంలో ఉన్న వ్యక్తులకు ఇది గణనీయంగా ఉంటుంది. మీ సప్లిమెంట్ల లేబుల్‌ను తనిఖీ చేయడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇది అధిక రక్తపోటు ఉన్నవారిని ఎక్కువ ప్రమాదంలో పడేస్తుంది.

### యోహింబైన్

ఆఫ్రికన్ చెట్టు బెరడు నుండి తీసుకునే యోహింబే, అంగస్తంభన లోపం అండ్ బరువు తగ్గడానికి మేలు చేస్తుంది. ఇది రక్తపోటు, హృదయ స్పందన రేటును పెంచే ఉద్దీపనగా పనిచేస్తుంది. అందువల్ల, యోహింబేతో కూడిన సప్లిమెంట్లు అధిక రక్తపోటు ఉన్నవారికి అనువైనవి కావు. ఈ సమ్మేళనం నోర్‌పైన్‌ఫ్రైన్ అనే హార్మోన్, మెసెంజర్ స్థాయిలను పెంచడం ద్వారా రక్తపోటును పెంచుతుంది. నోర్‌పైన్‌ఫ్రైన్ స్థాయిలు పెరిగినప్పుడు, రక్త నాళాలు ఇరుకైనవిగా మారడం ప్రారంభమవుతుంది. రక్త ప్రవాహాన్ని దెబ్బతీసి అధిక రక్తపోటుకు దారితీస్తుంది. ఎఫెడ్రా బరువు తగ్గించే సప్లిమెంట్లలో ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన ఎఫెడ్రా , రక్తపోటును గణనీయంగా పెంచే ఉద్దీపన. హృదయ సంబంధ ప్రమాదాల కారణంగా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ 2004లో ఎఫెడ్రాను నిషేధించింది. కానీ ఇది ఇప్పటికీ 'సహజ' శక్తి బూస్టర్‌లుగా మార్కెట్ చేసిన కొన్ని మూలికా ఉత్పత్తులలో కనిపిస్తుంది. దీనిలో కనిపించే ఎఫెడ్రిన్ ఆల్కలాయిడ్లు బలమైన ఉద్దీపనగా పనిచేస్తాయి. అధిక రక్తపోటు, గుండెపోటు, స్ట్రోక్‌లు, ఆకస్మిక మరణానికి కూడా కారణమవుతాయి. సప్లిమెంట్లలో ఇది నిషేధించినప్పటికీ, దాని క్రియాశీల పదార్థం ఎఫెడ్రిన్ ఇప్పటికీ కొన్ని ఉబ్బసం, అలెర్జీ మందులలో కనిపిస్తుంది. కాబట్టి లేబుల్‌లను తనిఖీ చేయడం, ఆరోగ్య సంరక్షణ ప్రదాతను సంప్రదించడం చాలా ముఖ్యం. గుర్తుంచుకోండి ఏదైనా సప్లిమెంట్ ప్రారంభించే ముందు మీరు మీ ఆరోగ్య సంరక్షణ ప్రదాతను సంప్రదించాలి. సప్లిమెంట్లు మందులతో సంకర్షణ చెందుతాయి. అవాంఛనీయ ఫలితాలకు దారితీయవచ్చు. కాబట్టి, ఏదైనా తీసుకునే ముందు మీ వైద్యుడితో మాట్లాడటం ముఖ్యం.

# మామిడి ముచ్చట్లు!



**'ఆహా! పచ్చి మామిడికాయ ముక్కలకు కాస్త ఉప్పు రాసుకుని తింటే ఆ మజానే వేరులే', 'అబ్బ... తియ్యటి మామిడి పండ్ల రసాల్ని జుర్రుకుని తింటుంటే ఉంటుందీ, ఆ అనుభూతిని వర్ణించలేం', 'కొబ్బరి ముక్కల్లాంటి కమ్మటి మామిడి రుచిని తలుచుకుంటేనే నోరూరిపోతుందంతే'... ఇలా ఒక్క మామిడి పండునే ఒక్కొక్కరు ఒక్కోలా ఆస్వాదిస్తుంటారు. ఎవరికి ఏ రుచి నచ్చినా... ఎవరూ 'నో' అని చెప్పలేని పండు మాత్రం మామిడే! అందుకేనేమో, కంటికి విందుగా, నోటికి పసందుగా, మనసుదోచే మరెన్నో వెరైటీలతో మన ముందుకొచ్చేసింది!**



మనకు తెలిసిన మామిడి పండ్లు... రసాలు, బంగినపల్లి, ఆల్ఫాన్సో... ఇలా ఏవైనా సరే, పసుపు రంగులోనే ఎక్కువగా కనిపిస్తాయి. మామిడి పండు అనగానే ఆ బంగారు ఛాయనే గుర్తొస్తుంది కూడా. కానీ నలుపు, నీలం, తెలుపు... తదితర రంగుల మామిడి రకాలూ దొరుకుతున్నాయిప్పుడు. థాయ్‌లాండ్, ఇండోనేషియా, వియత్నాం, ఫిలిప్పీన్స్ దేశాల్లో అధికంగా కనిపించే బ్లాక్ మ్యాంగో భలేగా ఉంటుంది. నిగనిగలాడే నల్లటి తోలుతో ఉండే ఈ పండును కోయగానే ఆరెంజ్ రంగు కండ కనిపిస్తుంది. ఆకుపచ్చ రంగు నుంచి పండిన తర్వాత నలుపు రంగులోకి మారిపోతుంది ఇది. నలుపు, బంగారు వర్ణాల ఈ పండు మేళవింపు చూడ్డానికి ఎంత కలర్‌ఫుల్‌గా ఉంటుందో! అరుదైన ఈ రంగు వల్లే దీన్ని బ్లాక్ స్టోన్ మ్యాంగో, కస్తూరి బ్లాక్ మ్యాంగో అనీ పిలుస్తారు. ఇతర మామిడి పండ్లలానే దీంట్లోనూ ఎసి విటమిన్లూ, యాంటీ ఆక్సిడెంట్లూ చాలానే ఉన్నా చక్కెర శాతం మాత్రం కాస్త తక్కువే. అరుదైన ఈ మ్యాంగో ఒక్కో పండు ధర రూ.300 నుంచి 500 వరకూ ఉంటుందట. ఈ వెరైటీ మన దగ్గరా కొన్ని నర్సరీల్లో అందుబాటులో ఉంది. చూడగానే తోలు తీసేసినట్టు కనిపించే థాయ్‌లాండ్ వైట్ మ్యాంగో





ఉన్నపళంగా అలా తినేలా ఉంటుంది. కమ్మటి వాసనలు వెదజల్లే ఈ మామిడిని ప్రత్యేకంగా అంటుకట్టి తయారుచేశారు. పుల్లపుల్లగా తియ్యతియ్యగా ఉండే దీన్ని వంటల్లో ఎక్కువగా వాడతారట. ఇంకా గుజ్జు మొత్తం తెల్లగా ఉండే 'వానీ' మ్యాంగో వెరైటీ వచ్చింది. ఆకుపచ్చ నుంచి గోధుమ రంగులోకి మారిపోయే ఈ మామిడి పండు లోపల పూర్తిగా తెల్లగా ఉంటుంది. దీన్ని విదేశాలతోపాటు మన దేశంలోనూ మహారాష్ట్ర లాంటి కొన్ని ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు.











# భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు..

**ఒక్కరోజే రూ.16 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద**



**ముంబై:** భారత్-పాకిస్థాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లోకి దూసుకెళ్లాయి. అమెరికా-చైనా ట్రేడ్ టాక్స్, రష్యా-ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ చర్చల్లో పురోగతి లాంటి అంతర్జాతీయ అంశాలు మార్కెట్లలో జోష్ పెంచాయి. దాంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆకాశమే హద్దుగా పైకి ఎగిశాయి.

ఇంట్రాడేలో సెన్సెక్స్ 3 వేలకుపైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 25 వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. 2024 డిసెంబర్ 16 తర్వాత బెంచ్ మార్క్ సూచీలు ఈ స్థాయిని అందుకోవడం ఇదే తొలిసారి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.16 లక్షల కోట్ల మేర పెరిగి రూ.432 లక్షల కోట్లకు చేరింది. ఇవాళ్టి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 80,803.80 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే దూకుడు కొనసాగించింది.

ఇంట్రాడేలో 3 వేల పాయింట్లకు పైగా లాభంతో 82,495.97 వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. చివరికి 2975.43 పాయింట్ల లాభంతో 82,429.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 916.70 పాయింట్ల లాభంతో 24,924.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువగా నిలకడగా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంక్ మినహా మిగిలిన షేర్లు లాభాలు చవిచూశాయి.

ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, ఎటర్నల్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65 డాలర్లు, బంగారం ఔన్సు 3222 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే ముగిశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 6.70 శాతం మేర లాభపడింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కరోజులో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు కూడా 4 శాతం మేర రాణించాయి.

# అమెరికా-చైనా మధ్య ట్రేడ్ డీల్..

**90 రోజుల పాటు సుంకాలు తగ్గించేందుకు అంగీకారం**




**న్యూయార్క్:** అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య కీలక ట్రేడ్ డీల్ కుదిరింది. ఇరుదేశాలు సుంకాలను భారీగా తగ్గించేందుకు సోమవారం ఓ అంగీకారానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం.. అమెరికా దిగుమతులపై చైనా సుంకాలను 125 నుంచి 10 శాతానికి తగ్గించింది. మరోవైపు చైనా దిగుమతులపై అమెరికా సుంకాలను 145 నుంచి 30 శాతానికి తగ్గించింది. ఈ తగ్గింపు 90 రోజులు మాత్రమే అమల్లో ఉండేలా ఇరు దేశాలూ ఒప్పందం కుదుర్చుకున్నాయి.

**అమెరికా-చైనా మధ్య టారిఫ్ వార్**

అమెరికా, చైనా మధ్య గత కొన్ని రోజులుగా వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. డ్రాగన్‌పై అధ్యక్షుడు ట్రంప్ సుంకాల మోత మోగించారు. రెండో సారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ అన్ని దేశాలపై భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. అయితే, చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై 145 శాతం టారిఫ్‌లు విధించనున్నట్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించారు.

గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించింది. ఇటీవల పెంచిన పన్నుతో ఇది 54 శాతానికి చేరుకున్నది. దీనిపై డ్రాగన్ దీటుగా స్పందించింది. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది. దీనిపై ఆగ్రహించిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గాలంటూ డ్రాగన్‌కు వార్నింగ్ ఇచ్చారు. మరో 50 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో టారిఫ్‌లు 104 శాతానికి చేరాయి.

అయినా చైనా వెనక్కి తగ్గలేదు. అమెరికాపై 84 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. ట్రంప్ హెచ్చరికలను చైనా పెడచెవిన పెట్టడంతో మళ్లీ అదనపు సుంకాల పోటు తప్పలేదు. చైనా నిర్ణయంతో ట్రంప్ మరో 21 శాతం బాదారు. దీంతో చైనాపై ప్రతీకార సుంకాలు 125 శాతానికి చేరింది. టక ఫెంటానిల్ అక్రమ రవాణాలో చైనా పాత్ర ఉందన్న ఆరోపణలకుగాను ప్రత్యేకంగా 20 శాతం సుంకాలు విధించడంతో మొత్తం టారిఫ్‌లు 145 శాతానికి చేరింది. ఇక చైనా సైతం అమెరికాపై 125 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. తాజాగా రెండు దేశాలు సుంకాలు తగ్గించేందుకు అంగీకారం కుదుర్చుకున్నాయి.

# పసిడి ప్రియులకు ఊరట..

**స్వల్పంగా తగ్గిన బంగారం ధర.. అదే బాటలో వెండి**



**న్యూఢిల్లీ:** భారతీయులకు బంగారానికి అవినావ భావ సంబంధం ఉంది. పూర్వకాలం నుంచి పెళ్ళిళ్ళు, ఫంక్షన్లు వంటి ప్రత్యేక రోజుల్లోనే కాదు.. ఏ చిన్న సందర్భం వచ్చినా సరే ముందుగా గుర్తుకొచ్చేది బంగారమే. డబ్బులు ఎప్పుడు చేతిలో ఉన్నా బంగారం కొనాలని కోరుకుంటారు. అంతగా పసిడి మన జీవితాలతో ముడిపడిపోయింది. అయితే పసిడి ధరలు అంతర్జాతీయ మార్కెట్ కు అనుగుణంగా మరుతూ ఉంటాయి. మన దేశంలో బంగారం, వెండి ధరలు కూడా అంతర్జాతీయ పరిస్థితులపై మాత్రమే కాదు ద్రవ్యోల్బణం, కేంద్ర బ్యాంకు బంగారు నిల్వ, వడ్డీ రేట్లలో ఆధారపడి ఉంటాయి. బంగారం హోదా తెలియజేసేందుకు ఒక చిహ్నంగా భావించడమే కాదు.. ప్రస్తుతం మంచి పెట్టుబడిగా కూడా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పసిడికి, వెండి భారీ డిమాండ్ నెలకొంది. దీంతో బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కోరుకుంటారు.

హైదరాబాద్‌లో బంగారం ధర స్వల్పంగా దిగి వచ్చింది. దీంతో పూర్ గోల్డ్ ( 24 క్యారెట్ల)10 గ్రాముల బంగారం ధర రూ. 98,670లు ఉండగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.90,440గా కొనసాగుతోంది. ఇవే ధరలు తెలుగురాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, పొద్దుటూరు, వరంగల్ లలో కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ప్యూర్ గోల్డ్ ధర 24 క్యారెట్ల ధర రూ. 98,820లగా కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 90,590లుగా ఉంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 10 గ్రాముల బంగారం ధర 22 క్యారెట్ల ధర రూ.90,440 వద్ద ఉంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 98,670 వద్ద కొనసాగుతోంది. ఇవే ధరలు దేశంలో ప్రధాన నగరాలైన చెన్నై, కోల్ కతా, కేరళ , బెంగళూరు, పూణే వంటి ప్రాంతాల్లో కూడా కొనసాగుతున్నాయి.

# టెస్ట్ క్రికెట్‌కు కోహ్లీ గుడ్ బై..

**బీసీసీఐ కోరినా వెనక్కి తగ్గని విరాట్..**




**న్యూఢిల్లీ:** డ్యాషింగ్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ నేపథ్యంలో అతను ఇన్‌స్టా అకౌంట్‌లో ఓ భావోద్వేగపూరిత పోస్టును పెట్టాడు. టెస్టు క్రికెట్‌లో దేశం తరపున అరంగేట్రం చేసి 14 ఏళ్లు అవుతున్నట్లు కోహ్లీ తన పోస్టులో తెలిపాడు. టెస్టు ఫార్మాట్ తనకు ఎంతో నేర్పిందని, తనను పరీక్షించిందని, తతను తీర్చిదిద్దిందని, జీవితానికి కావాల్సిన ఎన్నో పాఠాలు నేర్పినట్లు కోహ్లీ పేర్కొన్నాడు. తెలుపు రంగు దుస్తుల్లో ఆడడం ఎంతో ప్రత్యేకంగా ఉంటుందన్నారు. టెస్టు ఫార్మాట్‌ను వీడడం సులువైన అంశం కాదు అని, కానీ సరైన సమయం అని, ఆ ఫార్మాట్ ఎంతో చేశానని, తనకు కూడా ఎంతో కలిసి వచ్చిందన్నారు. ఊహించినదాని కన్నా ఎక్కువే లాభం జరిగిందన్నాడు.

కోహ్లీ 123 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. 68 మ్యాచ్‌లకు అతను కెప్టెన్‌గా చేశాడు. బ్యాటింగ్ సగటు 46.85తో అతను 9230 రన్స్ చేశాడు. జూన్‌లో ఇంగ్లండ్‌తో అయిదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభంకానున్న నేపథ్యంలో కోహ్లీ తన నిర్ణయాన్ని వెల్లడించారు. గత కొన్ని రోజుల నుంచి కోహ్లీ టెస్టు రిటైర్మెంట్‌పై చర్చ జరుగుతోంది. రోహిత్ తరహాలోనే టెస్టు నుంచి తప్పుకునేందుకు కోహ్లీ సిద్దంగా ఉన్నట్లు వార్తలు వ్యాపించాయి. అయితే తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని కోహ్లీ.. బీసీసీఐకి చెప్పినట్లు కూడా తెలుస్తోంది.

వాస్తవానికి టెస్టు ఫార్మాట్‌లో కోహ్లీ పెద్దగా ఫామ్‌లో లేడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్ పెర్త్ మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీ కొట్టాడు. సుమారు ఏడాది గ్యాప్ తర్వాత అతను ఆ ఇన్నింగ్స్ ఆడాడు. ఓ దశలో టెస్టుల్లో కోహ్లీ యావరేజ్ టాప్‌గా ఉండేది. టాప్ ఫామ్‌లో ఉన్న సమయంలో కోహ్లీ టెస్టు యావరేజ్ 55.10గా ఉంది. కానీ గత 24 నెలల్లో అతను టెస్టు యావరేజ్ 32.56కు పడిపోయింది.

అనుభవం దృష్ట్యా.. ఇంగ్లండ్ టూరుకు అవసరం ఉన్నా.. కోహ్లీ తనంతటే తానే తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. టెస్టుల్లో కోహ్లీ 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు చేశాడు.

**థ్యాంక్యూ విరాట్ కోహ్లీ: బీసీసీఐ**

అతనికి అతనే సాటి. టెస్టుల్లో అతనో మైటీ వారియర్. ఆ యోధుడు ఇప్పుడు టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై ప్రకటించాడు. అద్భుతమైన కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. ఎందరో క్రికెటర్లకు ఇన్‌స్పిరేషన్‌గా నిలిచాడు ఆ స్టార్ బ్యాటర్. టెస్టు బ్యాటింగ్ యావరేజ్‌తో అందర్నీ స్టన్ చేసిన విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌పై సోమవారం బీసీసీఐ ఓ వీడియోను రిలీజ్ చేసింది. తెలుపు దుస్తుల్లో కోహ్లీ చాటిన ఘనతను ఆ వీడియోలో ప్రజెంట్ చేసింది బీసీసీఐ. టెస్టు క్రికెట్‌లో తనను ఉత్తేజపరిచింది ఆ గేమ్‌లో ఉన్న ఛాలెంజ్ అని కోహ్లీ వీడియోలో పేర్కొన్నాడు. బీసీసీఐ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసిన వీడియోను మీరూ తిలకించండి.

## మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టిన గుజరాత్ టైటాన్స్..!



**గుజరాత్:** భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ అవగాహన నేపథ్యంలో గుజరాత్ టైటాన్స్ జట్టు శిక్షణను ప్రారంభించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిస్థితులు ఉద్రిక్తత మారిన నేపథ్యంలో ఐపీఎల్ పరిపాలన టోర్నీని వారం పాయిటు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పరిస్థితులు సద్దుమణుగుతున్న నేపథ్యంలో టోర్నీ పునః ప్రారంభంపై చర్చలు జరిగాయి. ఈ నెల 16న లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభం కానున్నంది. ఇక గుజరాత్ జట్టు ఇంకా మూడు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఢిల్లీ, ముంబయి, చెన్నైతో కీలక మ్యాచులున్నాయి. ఈ మూడు మ్యాచుల్లోనూ రాణించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలువాలని ఆశిస్తున్నది. గుజరాత్ ఇప్పటి వరకు ఆడిన 11 మ్యాచుల్లో ఎనిమిదింట్లో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఈ క్రమంలో అదే ఊపుతో మరోసారి చాంపియన్‌గా నిలువాలని భావిస్తుంది.

గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ ఆటగాళ్లకు మూడు గంటలకుపైగా జట్టు ప్రాక్టీస్‌లో పాల్గొన్నట్లు తెలిపింది. సస్పెన్షన్ కారణంగా సీజన్‌లో కొన్ని మ్యాచులకు దూరమైన కగిసో రబాడ మళ్లీ జట్టుతో చేరాడు. రూథర్‌ఫోర్డ్, మహమ్మద్ సిరాజ్, కెప్టెన్ గిల్‌తో కలిసి నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. ఇదిలా ఉండగా.. ఈ నెల 8న పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ అర్ధాంతరంగా ముగిసిన విషయం తెలిసిందే. అయితే, ఈ మ్యాచ్ స్టేటస్‌ని బీసీసీఐ ఇప్పటి వరకు ప్రకటించలేదు. ఇరు జట్లకు ఎలాంటి పాయింట్లు కేటాయించలేదు.

## టెస్ట్ కెప్టెన్సీ రేసు నుంచి తప్పుకున్న జస్ప్రీత్ బుమ్రా

**ఆ ఇద్దరిలో ఒకరికి కెప్టెన్సీ.. మరొకరు వైస్ కెప్టెన్..!**



**న్యూఢిల్లీ:** టెస్టులకు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో కొత్త సారథి ఎవరు ? అన్న చర్చ సాగుతున్నది. వచ్చే నెల నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో టీమిండియా పాల్గొనున్నది. ఈ పర్యటన కోసం బీసీసీఐ ఈ నెలలోనే జట్టును ఎంపిక చేయాల్సి ఉంది. కొత్త కెప్టెన్ ఎవరనే దానిపై ఇప్పటి వరకు ఓ స్పష్టత రాలేదని తెలుస్తున్నది. కెప్టెన్ రేసులో యువ బ్యాట్స్‌మెన్ శుభ్‌మన్ గిల్, స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్, ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మధ్య విపరీతమైన పోటీ ఉన్నది. అయితే, టెస్ట్ కెప్టెన్సీ రేసు నుంచి బుమ్రా తప్పుకున్నట్టు ఓ మీడియా నివేదిక తెలిపింది.

ఇక కెప్టెన్సీ రేసు గిల్-పంత్ మధ్యనే ఉ ందని పేర్కొంది. టెస్ట్ కెప్టెన్సీ బుమ్రా పేరు సైతం గట్టిగానే వినిపించింది. కానీ, పనిభారం కారణంగా ఐదు మ్యాచుల సుదీర్ఘ టెస్ట్ సిరీస్‌లోని అన్ని మ్యాచులు ఆడుతానని హామీ ఇవ్వలేనని సెలెక్టర్లకు చెప్పాడని ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్ తెలిపింది. ఈ పరిస్థితిలో సెలెక్టర్లు సిరీస్ అంతా నిలకడగా రాణించే ఆటగాడికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పింది. బుమ్రా స్వయంగా కెప్టెన్సీ రేసు నుంచి తప్పుకోవడంతో సెలెక్టర్లు ప్రసుతం శుభ్‌మన్ గిల్, పంత్‌లో ఎవరైనా ఒకరిని కెప్టెన్సీకి ఎంపిక చేయాలని భావిస్తున్నారు. ఇద్దరిలో ఎవరో ఒకరు కెప్టెన్ అయినా.. మరొకరిని వైస్ కెప్టెన్‌గా నియమించే అవకాశం ఉంది. ఇంగ్లాండ్ సిరీస్ కోసం భారత జట్టును ఈ నెల 24లోగా ప్రకటించే అవకాశం ఉంది.

రాబోయే ఇంగ్లాండ్ సిరీస్‌కు ముందు టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోవాలని విరాట్ కోహ్లీ భారత క్రికెట్ నియంత్రణ బోర్డుకి చెప్పినట్లుగా పేర్కొంది. అయితే, దీనిపై బీసీసీఐ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అదే సమయంలో బీసీసీఐ వర్గాలు ఈ వార్తలను ఖండించనూ లేదు. జూన్‌లో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ ప్రారంభానికి ముందే తాను టెస్టుల నుంచి రిటైర్ కావాలని భావిస్తున్నట్లు విరాట్ ఏప్రిల్‌లోనే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో చెప్పినట్లు తెలిసింది. అగార్కర్, బీసీసీఐకి చెందిన ఓ అధికారి మరోసారి కోహ్లీతో సమావేశం కావాలని భావిస్తున్నారు. కోహ్లీ తన నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కోరినట్లుగా పలు నివేదికలు తెలిపాయి. అయితే, ఇప్పటి వరకు మళ్లీ తన నిర్ణయాన్ని కోహ్లీ వెల్లడించలేదని సమాచారం.

# షాకింగ్ డెసిషన్ తీసుకున్న తాలిబన్ సర్కారు..!

**ఆఫ్ఘనిస్తాన్‌లో చెస్‌పై బ్యాన్..**

**న్యూఢిల్లీ:** తాలిబన్ ప్రభుత్వం షాకింగ్ నిర్ణయం తీసుకున్నది. తమ దేశంలో చెస్ ఆడడంపై నిషేధం విధించింది. ఇప్పటికే పలు రకాల క్రీడలను వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆఫ్ఘనిస్తాన్‌లోని ఖామా ప్రెస్ ఈ విషయాన్ని వెల్లడించింది. మే ఒకటి నుంచి చెస్‌ని నిలిపివేస్తున్నట్లు క్రీడా మంత్రిత్వ శాఖ అధికారులు ధ్రువీకరించింది. గత సంవత్సరం ప్రభుత్వం ప్రకటించిన ధర్మ ప్రచారం, దుర్మార్గ నివారణ చట్టం కింద బ్యాన్ విధిస్తున్నట్లు స్పోర్ట్స్ డైరెక్టరేట్ ప్రతినిధి అటల్ మష్వానీ పేర్కొన్నారు. చెస్ జూదానికి మూలంగా పరిగణిస్తున్నామని.. ఇస్లామిక్ చట్టాలకు అనుగుణంగా ఉందో లేదో నిర్ధారించే వరకు నిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

అప్పటి వరకు చెస్ సంబంధిత కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేసింది. తాలిబన్ల ధర్మం ప్రచారం, దుర్మాగ నివారణ మంత్రిత్వ శాఖ సైతం ఆఫ్ఘనిస్తాన్ చెస్ సమాఖ్యను రద్దు చేసింది.. ఇస్లామిక్ చట్టం చెస్‌ను 'హరామ్' (నిషిద్ధం)గా ప్రకటించిందని ఖామా ప్రెస్ నివేదించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లు అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటి నుంచి సాంస్కృతిక, సామాజిక, క్రీడా



కార్యక్రమాలపై ఆంక్షలు పెరుగుతున్నాయి. తాలిబన్ నిషేధం ప్రకటనకు ముందు అనేక మంది చెస్ ఆటగాళ్లు, చెస్ సమాఖ్య అధికారులు తమ కార్యకలాపాలను కొనసాగించేందుకు తాలిబన్ నేతృత్వంలోని క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి, ఆర్థిక సహాయాన్ని అభ్యర్థించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే తాలిబన్ సర్కారు వారి ఆశలపై నీళ్లు చల్లుతూ.. నిషేధం విధించింది. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌లో సాంస్కృతిక, వినోద కార్యకలాపాలను పరిమితం చేయడానికి వారి వ్యూహాన్ని చూపిస్తుంది.

తాలిబన్లు ఇప్పటికే ఆఫ్ఘనిస్తాన్‌లో మహిళలపై అనేక ఆంక్షలు విధించారు. ఈ విధానాలు ఎంతకాలం కొనసాగుతాయో చూడాల్సిందే. అయితే, తాలిబన్ సర్కారు నిర్ణయాలపై అంతర్జాతీయ సమాజం నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తెస్తుందా? లేదా చూడాల్సిందే. ఇదిలా ఉ ండగా.. ఫిబ్రవరిలో విద్యార్థులకు కొత్త యూనిఫారం తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు బ్లూ కలర్ చొక్కాలు, ప్యాంటు, తెల్లటి టోపీలు ధరించాలని చెప్పింది. 10 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు తెల్ల చొక్కాలు, ప్యాంటు, తెల్లటి తలపాగాలు ధరించాలని చెప్పింది. ఆరో తరగతి వరకు విద్యార్థులకు బ్లాక్ కలర్ డ్రెస్ ధరించాలని ఆదేశించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో అధికారం చేజిక్కించుకున్నప్పటి నుంచి తాలిబన్లు ఆరో తరగతి కంటే ఎక్కువ చదువుకోవడాన్ని తాలిబన్లు నిషేధించారు. విశ్వవిద్యాలయాలు, వైద్య విద్య అందకుండా చేసింది. అలాగే, మహిళలు క్రీడలు ఆడకూడదంటూ బ్యాన్ చేసిన విషయం తెలిసిందే.



## పాన్ ఇండియా పేరుతో వంచన

### అనురాగ్ కశ్యప్ సంచలన వ్యాఖ్యలు

**టాకీస్:** తన వ్యాఖ్యలతో కొత్త వివాదానికి అనురాగ్ కశ్యప్ తెరలేపాడు. ఇటీవల వస్తున్న పాన్ ఇండియా చిత్రాలు అనేవి ఒక పెద్ద స్కాం అని విమర్శించాడు. పాన్-ఇండియా సినిమాలకు కేటాయిస్తున్న భారీ బడ్జెట్‌లు, వాటి నిర్మాణానికి తీసుకుంటున్న ఎక్కువ సమయం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మంచి కథలు చెప్పడం కంటే కేవలం పెద్ద సెట్‌ల కోసమే ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తున్నారని ఆయన విమర్శించారు. 'ఉరి: ది సర్జికల్ ÷-టస్ట్రైక్', 'బాహుబలి', 'కేజీఎఫ్' వంటి విజయవంతమైన చిత్రాల పద్ధతినే ఇప్పుడు చాలా పాన్ ఇండియన్ సినిమాలు అనుసరిస్తున్నాయని కశ్యప్ అన్నారు. ఈ ట్రెండ్ కొత్త ఆలోచనలకు అడ్డుపడుతోందని, కథను చెప్పే విధానం యొక్క నాణ్యతను తగ్గిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

పెద్ద స్థాయిలో వినోదం అందించడం కంటే బలమైన కథాంశాలపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యమని ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. చాలా సినిమాలు మంచి కథల వల్లే విజయం సాధించాయని, కేవలం 'పాన్-ఇండియా' అనే పేరు వల్ల కాదని ఆయన గుర్తు చేశారు. అయితే కొన్ని పాన్-ఇండియా చిత్రాల విజయాన్ని ఆయన అంగీకరించారు. ముఖ్యంగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహించిన 'ఆర్ఆర్ఆర్' సినిమాను ఆయన మెచ్చుకున్నారు. అలాగే, 'స్త్రీ'వంటి సినిమాలు విడుదలయ్యే ముందు పాన్-ఇండియా చిత్రాలుగా గుర్తింపు పొందకపోయినా గొప్ప విజయాన్ని సాధించాయని ఆయన పేర్కొన్నారు. పెద్ద బడ్జెట్‌తో నిర్మిస్తున్న పాన్-ఇండియా సినిమాలలో కేవలం 1శాతం మాత్రమే బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంటున్నాయని కశ్యప్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువ కలెక్షన్ల కోసం ఎక్కువ సినిమాలు తీయడం వల్ల సినిమా నిర్మాణ నాణ్యత దెబ్బతింటోందని ఆయన అభిప్రాయపడ్డారు.

ముద్దుగుమ్మ

## మమితా బైజు

### కుర్రాళ్ళు ఫిదా అవ్వాల్సిందే

టాకీస్: మమిత 2017లో మలయాళ చిత్రం సర్వోపరి పాలక్కారన్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆపరేషన్ జావా (2021), ఖో ఖో (2021), సూపర్ శరణ్య (2022), ప్రణయ విలాసం (2023) వంటి చిత్రాలలో అల్ఫోన్సా, అంజు, సోనా, గోపిక పాత్రలతో ఆమె గుర్తింపు పొందింది. ఖోఖో చిత్రంలో మమిత నటనకు కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ అవార్డ్‌లో ఉత్తమ సహాయ నటి అవార్డు లభించింది. 2024లో విడుదలైన ప్రేమలు చిత్రం ఆమెకు భారీ విజయాన్ని తెచ్చిపెట్టింది, ఇది మలయాళ చిత్రసీమలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. తెలుగులోనూ ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దాంతో ఒక్కసారిగా ఈ చిన్నదాని క్రేజ్ డబుల్ అయ్యింది. దీంతో ఆమెకు తెలుగు నిర్మాతల నుండి ఆఫర్లు వచ్చాయి. ఇప్పటికే ఈ చిన్నదానికి క్రేజీ ఆఫర్స్ వచ్చాయని తెలుస్తుంది. సాయి పల్లవి, నిత్యా మీనన్ తరహాలో బలమైన కథాపాత్రలు, మంచి స్క్రిప్ట్‌లతో తెలుగులో అడుగుపెట్టాలని భావిస్తోంది. ప్రస్తుతం ఆమె తమిళంలో తలపతి 69, విష్ణు విశాల్‌తో ఒక చిత్రం, ప్రదీప్ రంగనాథన్‌తో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో ఒక చిత్రం, అథర్వాతో మరో చిత్రంలో నటిస్తోంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించింది. ఆమె స్టైల్, లుక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.



## నందమూరి కుటుంబంలో మరో తారకరామారావు

**టాకీస్:** నందమూరి హరికృష్ణ మనవడు, జానకీరామ్ కుమారుడు నందమూరి తారక రామారావు హీరోగా పరిచయమవుతున్న విషయం తెలిసిందే. నందమూరి వంశం నాలుగో తరం వారసుడిగా తారక్ ఎంట్రీ-ఇవ్వబోతున్నాడు. ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం





సోమవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ వేడుకకు నారా భువనేశ్వరి, దగ్గుబాటి పురందేశ్వరి, గారపాటి లోకేశ్వరి తదితరులు హాజరయ్యారు. నారా భువనేశ్వరి హీరో హీరోయిన్లపై క్లాప్ కొట్టి వారిని అభినందించారు. అయితే ఈ మూవీ ప్రారంభమైన సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా తారక రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు. తారక రామారావు ఇండస్ట్రీలో అడుగుపెడుతున్న సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఎన్టీఆర్ గొప్ప విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నానని సీఎం చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మూవీ ప్రారంభోత్సవం అనంతరం హీరో తారక రామారావు మాట్లాడుతూ, మా ముత్తాత ఎన్టీఆర్, మా తాత హరికృష్ణ, మా నాన్న జానకీరామ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయని నమ్ముతున్నాను. ఈ రోజు నా కుటుంబ సభ్యులందరూ నన్ను ప్రోత్సహించడానికి ఇక్కడికి రావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ప్రేక్షకుల ప్రేమాభిమానాలే నన్ను ముందుకు నడిపిస్తాయని నమ్ముతున్నాను. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచి మీడియా ఎంతో సహకరించింది. వారందరికీ కృతజ్ఞతలని అన్నారు.

## బెంజ్ సినిమాలో ప్రియామోహన్



**టాకీస్:** లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ నుండి ఇప్పటి వరకు త్రీ మూవీస్ వచ్చాయి. ఖైదీ, విక్రమ్, లియో ఈ మూడింటికీ లోకేశ్ కనగరాజే దర్శకుడు. కథలన్నీ ఆయనవే. కానీ ఫోర్త్ ఇన్‌స్టాల్ మెంట్ మూవీ బెంజ్‌లో కొత్త దర్శకుడికి ఛాన్స్ ఇచ్చాడు లోకీ. రోమియో అండ్ సుల్తాన్ ఫేం బక్కియరాజ్ కన్నన్‌కు బెంజ్‌ను డీల్ చేసే బాధ్యతలు అప్పగించాడు. రాఘవ లారెన్స్ హీరోగా వస్తోన్న ఈ ప్రాజెక్టుకు లోకీ స్టోరీ ఇవ్వడంతో పాటు-.. ప్రజెంటర్‌గా వ్యవహరిస్తున్నాడు. బెంజ్ ఎనౌన్స్ చేసి సిక్స్ మంత్స్ దాటింది. కానీ కూలీ ప్రాజెక్టులో బిజీగా ఉన్న నేపథ్యంలో లోకేష్ కనకరాజ్ బెంజ్ కథకు మెరుగులు దిద్దలేదని తెలుస్తోంది. ఇక ఇప్పుడు అన్నీసెట్ అవడంతో బెంజ్ ను స్టార్ట్ చేసాడు. తాజా అప్డేట్ ప్రకారం నేడు ఈ సినిమాను అధికారకంగా స్టార్ట్ చేసారు. చెన్నై లో షూటింగ్ మొదలు పెట్టారు. బెంజ్‌లో లారెన్స్‌తో పాటు- సీనియర్ హీరో మాధవన్, అలాగే మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ మెయిన్ లీడ్స్‌గా కనిపించబోతున్నారు. కోలీవుడ్ భామ ప్రియా మోహన్ హీరోయిన్‌గా నటించబోతుంది. బెంజ్ అవుట్ పుట్ మరింత వయెలెంట్‌గా కథ నేపథ్యంలో రానుంది. ఇక ఈ సినిమాకు తమిళ్ నయా మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ బాణీలు సమకూరుస్తున్నారు. దీని తర్వాత ఖైదీ2ని పట్టాలెక్కించనున్నాడు లోకీ. మరీ బెంజ్ కోసం రోలక్స్ తరహా రోల్ రీ క్రియేట్ చేశాడో, కొత్త క్యారెక్టర్ డిజైన్ చేశాడో చూడాలి.

## నాగార్జునతో ఛాన్స్ మిస్ చేసుకున్న కాజల్



**టాకీస్:** టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న నటీమణులలో కాజల్ అగర్వాల్ ఒకరు. ఇప్పటి వరకు ఎన్నో సినిమాలతో, అద్భుతమైన విజయాలు అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. కేవలం తెలుగు సినిమాల్లో మాత్రమే కాకుండా ఇతర భాషలోను దాదాపు అందరు స్టార్ హీరోలతో జతకట్టింది. తన నటన అందంతో ఇండియా వ్యాప్తంగా మంచి క్రేజ్, ఫ్యాన్ ఫాలోయింగ్ దక్కించుకుంది. ఇక పోతే కాజల్ కేవలం హీరోయిన్ పాత్రలు మాత్రమే కాకుండా స్పెషల్ సాంగ్స్ కూడా చేసింది. అయితే తాజాగా ఈ అమ్మడు, నాగార్జునకు సంబంధించిన ఆసక్ఇకర వార్త ఒకటి వైరల్ అవుతుంది..టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోలలో ఒకరైనా నాగార్జున ఇంకా కాజల్ కాంబోలో ఇప్పటివరకు ఒక్క సినిమా కూడా రాలేదు. కానీ వీరిద్దరి కాంబోలో రెండు సినిమాలు మిస్ అయినట్లు- తెలుస్తోంది. నాగార్జున నటించిన 'రగడ' అనే మూవీ చూసే ఉంటారు. ఇందులో అనుష్క, ప్రియమణి హీరోయిన్లుగా నటించారు. అయితే మొదట ఈ మూవీలోని ప్రియమణి పాత్రకు కాజల్‌ను అనుకున్నారట. కానీ కొన్ని కారణాల వల్ల ఆమెను కాకుండా ప్రియమణిని తీసుకున్నారట. ఇక నాగార్జున హీరోగా రూపొందిన 'ది ఘోస్ట్' మూవీ లో కూడా మొదట కాజల్‌ను హీరోయిన్ గా అనుకున్నారట. కానీ అది కుదరకపోవడంతో ఆ సినిమాలో సోనాల్ చౌహాన్ ను హీరోయిన్‌గా తీసుకున్నారు. ఇలా రెండు సార్లు నాగార్జున తో నటించే అవకాశాన్ని కాజల్ మిస్ అయినట్లు తెలుస్తోంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.